- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

ఆదివారం
29-03-2026

సంపుటి : 01 సంచిక :7 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.



Mr. NAKKA RAJU
Chairman of Namastey Mahaaprabha

Published From RANGAREDDY తెలంగాణ. RNI NO : TGTEL/26/A0738 VOLUME : 01 ISSUE : 7 NAMASTEY MAHAAPRABHA

## ప్రభుత్వ ఆధీనంలోకి హైదరాబాద్ మెట్రో



- అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం ఆమోదం
- మెట్రో విస్తరణకు మార్గం సుగమం
- తీర్మానం ప్రవేశ పెట్టిన సీఎం రేవంత్

**హైదరాబాద్, మార్చి 28(మహాప్రభ):**
హైదరాబాద్ మహానగర రవాణా వ్యవస్థలో ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది. ఇప్పటివరకు ప్రైవేట్ భాగస్వామ్యంతో నడుస్తున్న మెట్రో రైలు ప్రాజెక్టును ప్రభుత్వం పూర్తిగా తన స్వాధీనంలోకి తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానానికి సభ ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో మెట్రో రైలు ఇకపై పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఆస్తిగా మారిపోనుంది.

-మిగతా 3 లో

## యుద్ధం ఎఫెక్ట్..



- తీవ్ర ఇంధన సంక్షోభంలో పాకిస్థాన్..
- గ్యాస్ సిలిండర్ ధర ఎంతో తెలుసా..?

**న్యూఢీల్లీ మార్చి 28(మహాప్రభ):**
యుద్ధం కారణంగా దాయాది దేశం పాకిస్థాన్ తీవ్ర ఇంధన సంక్షోభంలో చిక్కుకున్నది. పశ్చిమాసియా లో నెలకొన్న ఉద్రిక్తతల ప్రభావంతో అక్కడ లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ ధరలు ఆకాశాన్నంటాయి. దేశవ్యాప్తంగా 11.67 కిలోల గ్యాస్ సిలిండర్ ధర.. పాకిస్థాన్ రూపాయల్లో ఏకంగా రూ.5,135 స్థాయికి పెరిగింది. పంజాబ్ ప్రావిన్స్ లో

-మిగతా 3 లో

# మూసీని అడ్డుకుంటే శివతాండవమే

### ప్రజలే అడ్డుకున్న వారికి బుద్ది చెబుతారు

- మూసీ కాలుష్యాన్ని నిర్మూలనే మా లక్ష్యం
- మంచిరేవుల ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం.
- దేవుడు మాకిచ్చిన అవకాశంగా చూస్తున్నాం
- ఆరు నూరైనా ఈ ప్రాజెక్టు ఆగదు.. ఇది శివదీక్ష
- హైదరాబాద్ నగరం మత సామరస్యానికి వేదిక.
- మంచిరేవులలో ఓంకారేశ్వరాలయ శంకుస్థాపనలో సీఎం రేవంత్

**రంగారెడ్డి మార్చి 28(మహాప్రభ):**
రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం సరికాదని, ఆరు నూరైనా.. అక్కడి సూర్యుడు ఇక్కడ ఉదయించినా ఈ ప్రాజెక్టు ఆగదని తేల్చి చెప్పారు. శనివారం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవుల వద్ద ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అలాగే చేవెళ్లలోని ఎంకేపల్లి వద్ద ఆధునిక గోశాలకూ ఆయన శంకుస్థాపన చేశారు. కుటుంబసమేతంగా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

-మిగతా 3 లో





## ఐపీఎల్ 2026లో ఆర్సీబీ బోణీ

- సన్‌రైజర్స్‌పై 6 వికెట్ల తేడాతో విక్టరీ
- తేలిపోయిన సన్ రైజర్స్ బౌలర్లు

**న్యూఢీల్లీ మార్చి 28(మహాప్రభ):**
ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌ను డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయంతో ఆరంభించింది. శనివారం బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో సన్ రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచులో ఆర్సీబీ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. సన్ రైజర్స్ నిర్దేశించిన 202 పరుగుల లక్ష్యాన్ని 15.4 ఓవర్లలోనే ఛేదించింది. ఛాంపియన్ ఆటకు అర్థం చెబుతూ అదరగొట్టింది. 202 పరుగుల

-మిగతా 3 లో



## బెట్టింగ్ ఊబిలో పడొద్దు..

- బతుకును ఛిద్రం చేసుకోవద్దు
- ఐపిఎల్ ప్రారంభంతో యువతకు సిపి సజ్జన్నార్ హెచ్చరిక

**హైదరాబాద్ మార్చి 28(మహాప్రభ):**
బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ట్విట్టర్ వేదికగా యువతను హెచ్చరించరు. ఐపీఎల్ సీజన్ మొదలవుతున్న తరుణంలో క్రికెట్‌ను కేవలం క్రీడగా ఆస్వాదించాలని, బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. వందలాది యాప్‌లను ప్రభుత్వం నిషేధించినప్పటికీ, ఇప్పుడు టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికగా ఈ దందా కొత్త రూపం దాల్చింది. కేవలం డబ్బు కోసం ఇటువంటి ప్రమాదకరమైన యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్ మాత్రమే కాకుండా ఫామ్ హౌస్‌లు, రహస్య ప్రాంతాల్లో సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లపై మా ప్రత్యేక నిఘా

-మిగతా 3 లో





## గల్ఫ్ దేశాలకు ఇరాన్ వార్నింగ్

- శత్రుదేశాలకు మీ భూమిని ఇవ్వొద్దు..
- అలా చేస్తే శత్రుస్థావరాలు భూస్థాపితం అయ్యేవరకు మేం దాడులు చేస్తూనే ఉంటాం.
- 'మేం ముందుగా ఏ దేశంపైనా దాడి చేయబోమని ఎన్నోసార్లు చెప్పాం
- మా ఆర్థిక మూలాలు, నిర్మాణాలపై దాడి జరిగినప్పుడు మాత్రమే మేం ఎదురుదాడి చేస్తాం

**న్యూఢీల్లీ మార్చి 28(మహాప్రభ):**
అమెరికా, ఇజ్రాయెల్‌తో యుద్ధం కొనసాగుతున్న వేళ పొరుగునే ఉన్న గల్ఫ్ దేశాలకు ఇరాన్ కీలక హెచ్చరిక జారీ చేసింది. ఇరాన్ శత్రుదేశాలైన అమెరికా, ఇజ్రాయెల్‌లకు తమ దేశాల్లో చోటు ఇవ్వొద్దని సూచించింది. గల్ఫ్ దేశాల్లో అమెరికా మిలిటరీ స్థావరాలు ఏర్పాటు చేసుకుని, అక్కడ్నుంచి ఇరాన్‌పై దాడిచేస్తోంది. అందువల్ల తమ దేశంపై దాడి చేసేందుకు అనువుగా అమెరికా సహా ఏ దేశానికి స్థలం ఇవ్వొద్దని ఇరాన్ కోరింది. ఈ మేరకు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ శనివారం ఒక ప్రకటన చేశారు. సౌదీ అరేబియా, యూఏఈ, ఒమన్, కువైట్, ఖతార్ దేశాలు ఈ ప్రాంతంలో అభివృద్ధి, రక్షణ కోరుకుంటే తమ శత్రుదేశాల సైన్యాన్ని వారి భూభాగంలోకి అనుమతించకూడదని సూచించారు.

-మిగతా 3 లో



## యుద్ధం సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటున్నాం

అనేక దేశాల్లో నిత్యావసర సరకుల కొరత ఏర్పడింది

3 లో

## భార్యతో అసహజ శృంగారం నేరం కాదు..

మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పు



3 లో


# కాళేశ్వరం అవినీతికి కేసీఆర్ బాధ్యుడు

### అవినీతిని పట్టుకోవడంలో సీఎం రేవంత్ విఫలం

- ప్రాజెక్టు కుంగిపోవడానికి, ప్రజా ధనం వృథా కావడానికి కేసీఆర్ నిర్ణయాలే కారణం
- సీఎం రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాష తెలంగాణ సమాజం తలదించుకునేలా ఉంది.
- రేవంత్ రెడ్డి మరీ దిగజారిపోయి.. ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు చేస్తున్నారు.
- కవితకు ప్రజాదరణ ఉంటే ఆదరిస్తారు
- మీడియాతో కేంద్రమంత్రి బండి సంజయ్

**కరీంనగర్ మార్చి 28(మహాప్రభ):**
కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఫల్యానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని బండి సంజయ్ స్పష్టం చేశారు. మరోసారి తెలంగాణ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యవహారశైలి, కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఫల్యం, కవిత కొత్త పార్టీ, తాజా రాజకీయ పరిణామాలపై బండి సంజయ్ తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజాగా కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా

-మిగతా 3 లో



## బెంగాల్‌ను టార్గెట్ చేస్తే.. కేంద్రంలో బీజేపీని గద్దె దించుతా

- రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఇళ్ల పైకి బుల్డోజర్లను ప్రయోగిస్తుంది
- బీజేపీ పార్టీ ఆదేశాల మేరకే ఎన్నికల సంఘం రాష్ట్రంలో ఎలక్షన్స్‌కు ముందు హడావిడిగా 'సర్' ప్రక్రియ చేపట్టింది
- రాష్ట్రంలో బీజేపీ ఉనికి లేకుండా చేయడం, ఆ పార్టీ నుంచి దేశాన్ని రక్షించడమే తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం

**న్యూఢీల్లీ మార్చి 28(మహాప్రభ):**
పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పై తీవ్ర విమర్శలు చేశారు. ముర్షిదాబాద్ లో శుక్రవారం రామనవమి శోభాయాత్ర జరుగుతున్న సమయంలో ఘర్షణలు చోటుచేసుకోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. పశ్చిమబెంగాల్‌ను ధ్వంసం చేయాలని చూస్తే బీజేపీ దేశంలో అధికారం కోల్పోవడం ఖాయమని అన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ఢిల్లీని స్వాధీనం చేసుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలతో కలిసి

-మిగతా 3 లో



# అయోధ్య యజ్ఞ శాలలో భారీ అగ్ని ప్రమాదం



**లక్నో:మార్చి 28(మహాప్రభ):**
అయోధ్యలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. శ్రీరామ నవమి సందర్భంగా ఏర్పాటు చేసిన మహా యజ్ఞశాలలో శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సరయూ నది తీరంలోని జమ్తారా ఘాట్ వద్ద నిర్వహించిన శ్రీ లక్ష్మీనారాయణ మహా యజ్ఞంలో ప్రమాద ఘటన చోటుచేసుకున్నదియజ్ఞశాలలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఒక ఎకరం విస్తీర్ణంలో వెదురు, గడ్డితో నిర్మించిన మండపం క్షణాల్లో కాలి బూడిదైంది. కాగా, ప్రమాద సమయంలో ఘటనా స్థలిలో యూపీ రవాణా మంత్రి దయాశంకర్ సింగ్, పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.

# ఇండిగో విమానం అత్యవసర ల్యాండింగ్





**న్యూఢిల్లీ: మార్చి 28(మహాప్రభ):**
విశాఖపట్నం నుంచి వస్తున్న ఇండిగో విమానం(6ఈ579) ఇంజన్ విఫలమైనట్లు అనుమానం రావడంతో ఢిల్లీ విమానాశ్రయ రన్‌వేపై పూర్తిస్థాయి అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. అత్యవసర ప్రొటోకాల్స్‌ని విమానాశ్రయ అధికారులు వెంటనే అమలు చేయడంతో రన్‌వే 28ని హై అలర్ట్‌లో ఉంచారు.కాగా, 161 మంది ప్రయాణికులతో వస్తున్న బోయింగ్ విమానం ఉదయం 11 గంటల సమయంలో రన్‌వేపై సురక్షితంగా దిగింది. ఈ ఘటనలో ఎటువంటి నష్టం జరగలేదని అధికార వర్గాలు తెలిపాయి. ల్యాండింగ్ కావడానికి కొన్ని క్షణాల ముందు సాంకేతిక లోపాన్ని గుర్తించినట్లు ఇండిగో ఓ ప్రకటనలో వెల్లడించింది.

## ఉగ్రవాది అంటూ విద్యార్థిపై తిట్ల వర్షం

### ప్రొఫెసర్ సస్పెండ్

**బెంగళూరు మార్చి 28(మహాప్రభ):**



బెంగళూరులోని పీఈఎస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఒకరు తరగతి గదిలో ఓ ముస్లిం విద్యార్థిని పదే పదే ఉగ్రవాది అని సంబోధించారు. మార్చి 24న జరిగిన ఈ ఘటనను మరో విద్యార్థి తన సెల్‌ఫోన్ కెమెరాలో చిత్రీకరించాడు. ఆ వీడియో ప్రకారం ప్రొఫెసర్ మురళీధర్ దేశ్‌పాండే ఆ విద్యార్థిపై గట్టిగా కేకలు వేస్తూ ఉగ్రవాది అన్న పదాన్ని ఉపయోగించడం ఆ క్లిప్‌లో వినిపించింది. దీనిపై ఓ విద్యార్థి సంఘం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా, మురళీధర్‌ని సస్పెండ్ చేస్తూ యూనివర్సిటీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

## ప్రధాని మోడీ -- ట్రంప్ చర్చల్లో ఎలాన్ మస్క్?

**మస్క్..మార్చి 28(మహాప్రభ):**



న్యూఢిల్లీ : ఇరాన్ యుద్ధంపై ప్రధాని నరేంద్రమోడీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫోన్‌లో చర్చించారు. ఇరువురు నేతలు చర్చిస్తున్న సమయంలో అసాధారణ ఘటన చోటుచేసుకుంది. ఈ కాల్‌లో బిలయనీర్ ఎలాన్ మస్క్ కూడా పాల్గొన్నట్లు న్యూయార్క్ టైమ్స్ నివేదించింది. సాధారణంగా ఇరువురు దేశాధినేతలు మాట్లాడుకునేటప్పుడు మూడో వ్యక్తి కాల్‌లో ఉండరు. మంగళవారం అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోడీల మధ్య ఫోన్ కాల్‌లో ఎలాన్ మస్క్ పాల్గొన్నట్లు ఆ నివేదిక పేర్కొంది. ప్రభుత్వంలో ఎలాంటి పదవి లేని వ్యక్తిని, ఇలాంటి సంఘర్షణ సమయంలో ఫోన్ కాల్‌లో చేర్చడం ప్రాధాన్యత సంతరించుకుంది. ది న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రకారం. మిడిల్ ఈస్ట్ లో తీవ్రమవుతున్న సంక్షోభంపై ముఖ్యంగా ఇంధన రవాణాకు కీలకంగా ఉన్న హార్ముజ్ జలసంధిపై ఇరాన్ నియంత్రణకు సంబంధించి ఇరువురు నేతలు ఆందోళన వ్యక్తం చేసినట్లు చెప్పింది. ఇలాంటి ఒక కీలకమైన కాల్‌లో సాధారణ పౌరులను చేర్చడం అరుదని, సున్నితమైన జాతీయభద్రతా సమస్యలు చర్చలకు వచ్చే అవకాశం ఉంటుందని నివేదిక పేర్కొంది. అయితే, ఈ వ్యవహారంపై భారత్ స్పందించింది.

# శాంతి కావాలంటే మేం చెప్పినట్టు వినాలి

### గల్ఫ్ దేశాలకు ఇరాన్ హెచ్చరిక



**టెహ్రాన్ మార్చి 28(మహాప్రభ):**
అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త సైనిక దాడుల నేపథ్యంలో గల్ఫ్ దేశాలపై ఇరాన్ విరుచుకుపడుతున్నది. ఈ క్రమంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజిష్కియాన్ తమ పొరుగు దేశాలకు హెచ్చరికలు చేశారు. గల్ఫ్ దేశాల్లో దాడులు ఆగాలన్నా..శాంతి, అభివృద్ధి నెలకొనాలన్నా తాము చెప్పినట్టు వినాలన్నారు.ఆయా దేశాల గగనతలాలను వినియోగించుకొని శత్రువులు తమపై దాడి చేస్తున్నారని అన్నారు. గగనతలాలను వినియోగించుకోవడానికి అమెరికా, ఇజ్రాయెల్‌లకు అనుమతి ఇవ్వొద్దని గల్ఫ్ దేశాలకు సూచించారు. శత్రు స్థావరాలు భూస్థాపితం అయ్యే వరకు దాడులు కొనసాగిస్తామని అన్నారు.


# రేప్ కేసుల్లో బాధితుల పేర్లను వెల్లడించొద్దు'



**న్యూఢిల్లీ మార్చి 28(మహాప్రభ):**
అత్యాచార కేసుల్లో బాధితుల పేర్లను ప్రస్తావించడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. బాధితుల పేర్లు, వారి కుటుంబ సభ్యుల వివరాలు వెల్లడించకూడదని హైకోర్టులకు ఆదేశాలు జారీ చేసింది.2018 నాటి తన తీర్పులో ఏ వ్యక్తి అయినా తమ ఆదేశాలను ఉల్లంఘించి బాధితుల పేర్లను ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో ముద్రించడం, ప్రచురించడం చేయకూడదని ఆదేశించింది. ఇది వరకు వెల్లడించిన తీర్పుల్లో బాధితులు, వారి కుటుంబీకుల పేర్లను ప్రస్తావించడంతో వారికి ఎదురయ్యే కళంకం గురించి తెలియకపోవచ్చని ధర్మాసనం పేర్కొన్నది.

# శ్రీలంకకు 38 వేల మెట్రిక్ టన్నుల ఇంధనాన్ని పంపిన భారత్

**న్యూఢిల్లీ మార్చి 28(మహాప్రభ):**
శ్రీలంకకు భారత్ 38 వేల మెట్రిక్ టన్నుల పెట్రోలియంను పంపింది. ఇందులో 20 వేల మెట్రిక్ టన్నుల డీజిల్, 18 వేల మెట్రిక్ టన్నుల పెట్రోల్ ఉన్నాయి. కొలంబోలోని భారత హైకమిషన్ శనివారం ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. పశ్చిమ ఆసియాలో జరుగుతున్న యుద్ధం, ప్రపంచ సరఫరా గొలుసులలో అంతరాయం కారణంగా శ్రీలంక ఎదుర్కొంటున్న ఇంధన సంక్షోభాన్ని తగ్గించడంలో ఈ సహాయం కీలక పాత్ర పోషిస్తుందని ఆ దేశ నాయకులు తెలిపారు. ఈ ఇంధన సరఫరా అభివృద్ధి ప్రధాని నరేంద్ర మోడీ , శ్రీలంక




అధ్యక్షుడు అనురా కుమార దిసానాయకే మధ్య గతవారం జరిగిన టెలిఫోన్ సంభాషణ తర్వాత జరిగింది. శ్రీలంక ఐఒసి గతంలో పశ్చిమ ఆసియా, సింగపూర్ నుండి మార్చి నెల కోసం ఇంధన సరఫరాలను పొందింది. అయితే, ఒప్పందాలు కుదుర్చుకున్న సరఫరాదారులు పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న సంఘర్షణ కారణంగా సరఫరా అంతరాయాలు, నౌకల లభ్యత లేకపోవడం వల్ల ఉత్పత్తులను అందించలేమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, ఐఒసిఎల్ ద్వారా 38,000 మెట్రిక్ టన్నుల అత్యవసర సరఫరాలను అందించాలని భారత్‌ను అభ్యర్థించారు. భారత ప్రభుత్వం, లంకా ఐఒసి ద్వారా శ్రీలంకకు ఇంధన సరఫరా నిరంతరాయంగా కొనసాగడానికి మద్దతు ఇస్తోంది. భారత్ అందించిన ఈ ఇంధన సహాయం శ్రీలంకకు ప్రస్తుత సంక్షోభ సమయంలో గణనీయమైన ఉపశమనాన్ని అందిచనుంది.

# సౌదీ యువరాజుతో ప్రధాని మోడీ చర్చలు

**- స్వేచ్ఛగా నౌకల రాకపోకలపై ఏకాభిప్రాయం**

**న్యూఢిల్లీ మార్చి 28(మహాప్రభ):**
: పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభంపై ప్రధాని నరేంద్ర మోడీ శనివారం యువరాజు, సౌదీ అరేబియా ప్రధాని ప్రిన్స్ మహ్మద్ బిన్ సల్మాన్‌తో ఫోన్లో చర్చించారు. నౌకల రవాణా స్వేచ్ఛగా జరిగేలా చూడాల్సిన ఆవశ్యకతను అంగీకరించారు. ప్రాంతీయ ఇంధన వసతులు, లక్ష్యాలపై జరుగుతున్న దాడులను భారత్ ఖండిస్తోందని పునరుద్ఘాటించారు. ఈ మేరకు మోడీ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. నౌకలు ప్రయాణించే మార్గాలను తెరిచి వుంచి, సురక్షితంగా వుండేలా చూడాల్సి



వుందన్నారు. ఈ విషయమై ఇరువురు నాయకుల మధ్య అంగీకారం నెలకొందన్నారు. సౌదీ అరేబియాలోని భారతీయుల భద్రతకు, సంక్షేమానికి వారు అందిస్తున్న మద్దతుకు కృతజ్ఞతలు తెలియచేశారు. ఫిబ్రవరి 28న పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైన తర్వాత సౌదీ యువరాజుతో ప్రధాని ఫోన్లో చర్చలు జరపడం ఇది రెండవసారి. ప్రపంచవ్యాప్తంగా 20శాతం ఇంధన వనరులు రవాణా జరిగే అత్యంత కీలకమైన సముద్ర మార్గం హార్మూజ్ జలసంధిపై ఇరాన్‌కు పట్టు వుంది. తాజా సంక్షోభం నేపథ్యంలో ఆ జలసంధిని దాటేందుకు చాలా కొద్ది నౌకలను మాత్రమే ఇరాన్ అనుమతిస్తోంది. ఈ యుద్ధం ఆరంభమైనప్పటి నుండి ఇప్పటివరకు అనేకమంది ప్రపంచ నేతలతో మోడీ మాట్లాడారు. అలాగే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా మోడీతో మాట్లాడారు. తాజా పరిస్థితులపై ఇరువురు అభిప్రాయాలు పంచుకున్నారు.

# మమతా దీదీ ఎప్పుడూ బాధితురాలిగా నటించే రాజకీయాలే చేశారు

**కోల్‌కతా మార్చి 28(మహాప్రభ):**
పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల వేడి మొదలైంది. శనివారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా పశ్చిమ బెంగాల్లో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమిత్ షా అధికార తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ప్రభుత్వంపై బిజెపి ఛార్జిషీట్‌ను విడుదల చేశారు. బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ రాజకీయాల్లో 'బాధితురాలి కార్డు'ను వాడుతున్నారని ఆయన ఆరోపించారు. కోల్‌కతాలో జరిగిన మీడియా సమావేశంలో అమిత్ షా మాట్లాడుతూ.. 'మమతా బెనర్జీ ఎప్పుడూ బాధితురాలి పాత్ర పోషిస్తూ వచ్చారు. కొన్నిసార్లు ఆమె కాలు విరగ్గొట్టుకుంటారు. మరికొన్నిసార్లు తలకు కట్టు కట్టుకుంటారు. కొన్నిసార్లు అనారోగ్యానికి గురవుతారు. ఆపై మళ్లీ ఎన్నికల సంఘం ముందు నిలబడి, ఆ సంస్థను దూషిస్తూ నిస్సహాయతను నటిస్తారు. కానీ బాధితుల కార్డు రాజకీయాలను బెంగాల్ ప్రజలు ఇప్పుడు పూర్తిగా అర్థం



చేసుకున్నారని ఆమెకు చెప్పడానికే నేను వచ్చాను' అని ఆయన అన్నారు. దేశంలో మరెక్కడా కనిపించని విధంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) సమయంలో కేవలం బెంగాల్‌లో మాత్రమే న్యాయాధికారులను నియమించారు. దీనికి కారణం ఏమిటి? మమతా బెనర్జీ దీనికి బెంగాల్ ప్రజలకు సమాధానం చెప్పాలి అని నిలదీశారు.అలాగే మమత ఎస్ఐఆర్‌పై ఆరోపణలు చేశారు. అయితే ఈరోజు నేను బెంగాల్ ప్రజలను అడగాలనుకుంటున్నాను. ఇక్కడ ఉంచిన ఆ చొరబాటుదారులను బెంగాల్ భవిష్యత్తును నిర్ణయించడానికి అనుమతించాలా? చొరబాటుదారులను కేవలం ఓటర్ల జాబితా నుంచే కాకుండా.. దేశం నుంచి బహిష్కరించడానికి మేము నిశ్చయించుకున్నాము. మా పార్టీ అజెండా అదే అని అమిత్ షా అన్నారు. మే 6వ తేదీన బెంగాల్లో బిజెపి ప్రభుత్వం ఏర్పడుతుంది. 45 రోజుల్లోగా సరిహద్దు కంచెకు అవసరమైన భూమిని బెంగాల్ బిజెపి ప్రభుత్వం భారత ప్రభుత్వానికి అందించి చొరబాటుదార్లను అరికడుతుంది. 77 వర్గాలను దీదీ ప్రభుత్వం ఓబిసి కేటగిరీలో చేర్చింది. ఈ 77లో 75 ముస్లిం వర్గాలే ఉన్నాయి. ఓబిసిలను మతం ఆధారంగా నిర్ణయిస్తారా? ఇది ఎక్కువ కాలం కొనసాగదు అని అన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చాక, నియామక కుంభకోణాల కారణంగా వయోపరిమితి ముగిసిపోయిన యువతకు ఐదేళ్ల వయో సడలింపు కల్పిస్తుంది. పారదర్శక నియామక ప్రక్రియను నిర్ధారించడంతోపాటు ఎస్ఎస్‌సి నియామకాలలో వారికి కూడా అవకాశం కల్పిస్తాము అని అమిత్ షా అన్నారు.

# మూసీని అడ్డుకుంటే శివతాండవమే

మొదటి తరువాయి

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. మంచిరేవుల ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం ఏ సంస్కృతి అంటూ ప్రశ్నించారు.. హైదరాబాద్ నగరం మత సామరస్యానికి వేదిక. మూసీ పరీవాహకంలో చారిత్రక శివాలయాన్ని పునఃనిర్మించాలని ఈశ్వరుని ఆశీర్వాదంతో పనులు మొదలుపెట్టాం. దీనిపై పెడార్థాలు తీసి విమర్శించే వారిపై ప్రజలే శివతాండవం చేస్తారని హెచ్చరించారు. ఆరు నూరైనా ఈ ప్రాజెక్టు ఆగదు.. ఇది శివదీక్ష. రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి ఈ ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. ఇది ఓట్ల కోసం.. నోట్ల కోసం చేస్తున్న పని కాదు. ఇది చరిత్రలో దేవుడి ఇచ్చిన గొప్ప అవకాశం.. ప్రజల పట్ల మాకున్న చిత్తశుద్ధి. ప్రజలే మాకు దేవుళ్లు. వారి ఆకాంక్షల మేరకే చేస్తున్నాం. చరిత్రాత్మక మందిరాన్ని నిర్మించుకోవడం ఒక చారిత్రక సందర్భం. ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఈ పని జరుగుతోందని అనుకోవట్లేదని సిఎం అన్నారు. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదంటారు. ఇది దైవేచ్ఛతో జరుగుతున్న కార్యక్రమం. 8 ఎకరాల్లో రూ.700కోట్లతో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నాం. ఈ ప్రాంతానికి 1400 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ చరిత్ర కనుమరుగు కాకుండా భవిష్యత్తు తరాలకు అందించాలన్నదే మా ప్రభుత్వ ఆలోచన. మూసీ నది పునరుజ్జీవనం చేయాలని చాలా మంది ప్రయత్నించారు. కారణాలు ఏవైనా ఆ ప్రయత్నాలు ముందుకు సాగలేదు. ఆ అవకాశం మనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నా అని వివరించారు.. విమర్శలు వచ్చినా, అడ్డంకులు సృష్టించినా దేవుడే వాటిని తొలగిస్తాడు. తెలంగాణ పౌరులకు నా విజ్ఞప్తి ఒక్కటే. చరిత్రను గమనిస్తే నది పరీవాహకంలోనే నాగరికత అభివృద్ధి చెందింది. సముద్ర పరీవాహకంలో వ్యాపారం, ఆర్థిక అభివృద్ధి జరిగింది. మూసా, ఈసా నదులు ఉన్నా సరైన విధంగా మనం ఉపయోగించుకోలేదు. మానవ తప్పిదాలతోనే మూసీ కాలుష్య కారకంగా మారిందని దానిని మార్చాల్సిందేనని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, సిఎస్ రామకృష్ణారావు,డిజిపి శివధర్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే పాల్గొన్నారు.

# యుద్ధం సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటున్నాం

## అనేక దేశాల్లో నిత్యావసర సరకుల కొరత ఏర్పడింది

న్యూఢిల్లీ

పశ్చిమాసియా లో ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు చేస్తున్న యుద్ధంతో ప్రపంచ దేశాలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. పలు దేశాలను ఇంధన కొరత ఇబ్బందులకు గురిచేస్తున్నది. ఈ క్రమంలో యుద్ధం విసురుతున్న సవాళ్లను భారత్ పూర్తి శక్తితో సమర్థంగా ఎదుర్కొంటోందని ప్రధా నరేంద్ర మోదీ అన్నారు. శనివారం నొయిడా లో అంతర్జాతీయ విమానాశ్రయం తొలి దశను ప్రధాని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.పశ్చిమాసియాలోని పరిస్థితిని ప్రపంచమంతా గమనిస్తోందని ప్రధాని అన్నారు. అక్కడ నెల రోజులుగా భీకర యుద్ధం కొనసాగుతోందని చెప్పారు. ఈ సంఘర్షణ కారణంగా.. ఆహారం, ఇంధనం, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని ఆయన ఆందోళన




వ్యక్తంచేశారు. అనేక దేశాల్లో నిత్యావసర సరకుల కొరత ఏర్పడిందని తెలిపారు. ప్రతి దేశం ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందని చెప్పారు. ఈ సంక్షోభం నుంచి దేశాన్ని రక్షించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ప్రజలు, రైతులపై యుద్ధ భారం పడకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. సంక్షోభ సమయంలో కూడా ఎలాంటి అంతరాయం లేకుండా దేశంలో అభివృద్ధి కొనసాగుతోందని అన్నారు. ఇలాంటి సమయాల్లో ప్రజలు ఐక్యతతో ఉండాలని, ప్రశాంతతను పాటించాలని మోదీ పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న ఇంధన సంక్షోభాన్ని ప్రస్తావిస్తూ.. ఈ విషయంలో ప్రజలను భయాందోళనకు గురిచేసే తప్పుడు ప్రచారాలు చేయవద్దని ప్రత్యర్థి రాజకీయ పార్టీలను కోరారు. తమ ప్రభుత్వ విధానాలు దేశ ప్రయోజనాలకు, దేశ ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగానే ఉంటాయని ప్రధాని చెప్పారు. కాగా నోయిడాలోని జేవర్ ప్రాంతంలో పీపీపీ పద్ధతిలో రూ.11,200 కోట్లతో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నారు. అధునాతన నావిగేషన్ సిస్టమ్స్ సాయంతో, 3,900 మీటర్ల పొడవైన ఈ విమానాశ్రయ రన్‌వేపై అతిపెద్ద విమానాలు కూడా రాకపోకలు సాగించే వీలుంటుంది. సరకు రవాణా కోసం కార్గో-లాజిస్టిక్ జోన్‌లను అనుసంధానిస్తూ మల్టీమోడల్ కార్గో హబ్‌ను కూడా నిర్మించారు.

# భార్యతో అసహజ శృంగారం నేరం కాదు..

## మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పు

న్యూఢిల్లీ

ఓ కేసులో మధ్యప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. భార్య తో 'అసహజ శృంగారం' జరిపారన్న ఆరోపణలపై భర్త మీద ఐపీసీ సెక్షన్ 377 కింద కేసు నమోదు చేయడం చెల్లదని స్పష్టం చేసింది. ఈ మేరకు గ్వాలియర్ ధర్మాసనం కీలక తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళ్తే.. మధ్యప్రదేశ్‌లోని భిండ్ జిల్లాకు చెందిన ఓ మహిళ తన భర్తపై తీవ్ర ఆరోపణలు చేసింది.తన భర్త తనపై అసహజ శృంగారానికి పాల్పడ్డాడని, వరకట్నం కోసం వేధించాడని, దాడిచేసి బెదిరించాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాంతో పోలీసులు ఆమె భర్తపై సెక్షన్ 377 (అసహజ నేరాలు), 498ఎ (వరకట్న వేధింపులు), 323 (దాడి), 506 (బెదిరింపులు) కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసును రద్దు



చేయాలని కోరుతూ భర్త హైకోర్టును ఆశ్రయించాడు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ మిలింద్ రమేష్ ఫడ్కే, సెక్షన్ 377 కింద నమోదైన కేసును కొట్టివేశారు.వివాహిత దంపతుల మధ్య జరిగే లైంగిక చర్యలను ఈ సెక్షన్ కింద నేరంగా పరిగణించలేమని ధర్మాసనం అభిప్రాయపడింది. వైవాహిక బంధంలో భర్త తన భార్యతో చేసే లైంగిక చర్య అత్యాచారం కాదని సెక్షన్ 375 లో ఉన్న మినహాయింపును కోర్టు ప్రస్తావించింది. అందువల్ల భార్యాభర్తల మధ్య జరిగే అసహజ సంభోగాన్ని కూడా సెక్షన్ 377 కింద నేరంగా చూడలేమని స్పష్టంచేసింది. అయితే వరకట్న వేధింపులు, దాడి, బెదిరింపులకు సంబంధించిన ఇతర సెక్షన్ల కింద కేసులను కొట్టివేయడానికి కోర్టు నిరాకరించింది.అసహజ శృంగార ఆరోపణ మినహా ఇతర ఆరోపణలపై విచారణ కొనసాగించాలని ఆదేశించింది. ఇటీవల గ్వాలియర్-చంబల్ ప్రాంతంలో వైవాహిక వివాదాల్లో సెక్షన్ 377ను ఆయుధంగా వాడుతున్నారని కోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది.

# కాళేశ్వరం అవినీతికి కెసిఆర్ బాధ్యుడు

మొదటి తరువాయి

మారాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..'కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు కేసీఆర్ అతిపెద్ద ఇంజనీర్. టోపీ పెట్టుకొని ప్రాజెక్టును డిజైన్ చేసింది ఆయనే. ఈ ప్రాజెక్టు కుంగిపోవడానికి, ప్రజా ధనం వృథా కావడానికి కేసీఆర్ నిర్ణయాలే కారణం. ప్రజలు ప్రతి విషయాన్నీ గమనించి సరైన నిర్ణయం తీసుకుంటున్నారు' అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవడంలో అధికార ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అన్నారు. 'సీఎం రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాష తెలంగాణ సమాజం తలదించుకునేలా ఉంది. ప్రజలు సైతం ఆయన భాషపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి మరీ దిగజారిపోయి.. ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఆయన వ్యవహార శైలి మార్చుకుంటే మంచిదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించారు. ముఖ్యమంత్రికి ఎన్నికల ముందు గుడ్లు గుర్తుకు వస్తాయి. గాడిద గుడ్లు అంటారు. ఎన్నికలు అయిపోయాక తొండలు గుర్తుకు వస్తాయి. తొక్కుడు గుర్తుకు వస్తుందన్నారు. కాళేశ్వరం గురించి ప్రస్తావిస్తూ.. ఆ ప్రాజెక్టును డిజైన్ చేసింది కేసీఆర్ ప్రభుత్వమే అన్నారు.. కాళేశ్వరం కూలిపోవడానికి అప్పుడున్న బీఆర్ఎస్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కుమ్మక్కయ్యారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి, కేసీఆర్‌లు కలిసే రాజకీయం చేస్తారని ఆరోపించారు. 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్థాయి మరిచి మాట్లాడుతున్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణకి ముఖ్యమంత్రి.. ఉత్తరాది రాష్ట్రాల నాయకుడు కాదు. ముందు మీరు ప్రకటించిన మొదలు ఆరు గ్యారంటీలు అమలు చెయ్యాలి. కేంద్రం ఏమిస్తున్నదో తెలంగాణ ప్రజానీకానికి తెలుసు. తెలంగాణ రాష్ట్రం ఖజానా పరిస్థితి బాగాలేదు.' అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పెడతారనే ప్రచారంపై బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ..'తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు ఇది సంకేతం. ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజకీయ పార్టీ స్థాపించే హక్కు కలిగి ఉంటారు. అది వారి వ్యక్తిగత, రాజకీయ స్వేచ్ఛకు సంబంధించింది. కవిత కొత్త పార్టీ పెట్టాలనే ఆలోచనను స్వాగతిస్తున్నాం' అని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యయుతంగా ఎవరైనా పార్టీ పెట్టుకోవచ్చు.. ప్రజలకు ఉపయోగ పడితే ఆ ఆ పార్టీలను వారు స్వాగతిస్తారన్నారు.

# ప్రభుత్వ ఆధీనంలోకి హైదరాబాద్ మెట్రో

మొదటి తరువాయి

నగరవాసుల చిరకాల వాంఛ అయిన మెట్రో విస్తరణకు ఉన్న అడ్డంకులను తొలగించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సాహసోపేతమైన అడుగు వేసింది. మెట్రో స్వాధీన తీర్మానానికి తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలని కోరారు. విస్తరణ కోసమే మెట్రో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో రైలును స్వాధీనం చేసుకోవడానికి సంబంధించి దాదాపు అన్ని పక్రియలు పూర్తయ్యాయి. ఈ నెల 31 నుంచి మెట్రో రైలును నడిపించేందుకు సర్కారు సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే మెట్రో రైలు స్వాధీనానికి సంబంధించి తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెట్రో స్వాధీన తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలని కోరారు. విస్తరణ కోసమే మెట్రో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్‌లో మెట్రో నెట్వర్క్‌ను భారీగా విస్తరించాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రణాళికలను సిద్ధం చేసింది. అయితే ప్రస్తుతం ఫేజ్-1 ప్రైవేట్ నిర్వహణలో ఉండటం వల్ల, కొత్తగా చేపట్టబోయే ఫేజ్-2 పనులకు అనేక సాంకేతిక , చట్టపరమైన అడ్డంకులు ఎదురవు తున్నాయి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం లేవనెత్తిన కొన్ని నిబంధనలను పరిష్కరించాలన్నా, మెట్రో విస్తరణ వేగంగా జరగాలన్నా మొత్తం నెట్వర్క్ ప్రభుత్వ ఆధీనంలో ఉండటం అత్యవసరమని ముఖ్యమంత్రి సభలో వివరించారు. అందుకే ఎల్ అండ్ టీ సంస్థ నుండి మెట్రో ఫేజ్-1ను 'హైదరాబాద్ మెట్రో రైల్వే లిమిటెడ్' ద్వారా స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం గట్టిగా నిర్ణయించుకుందని వివరించారు. ఈ స్వాధీన పక్రియతో పాటు మెట్రోను నగరం నలుమూలలా విస్తరించేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికలను ఆవిష్కరించింది. ఫేజ్-2ఏ కింద సుమారు 76.4 కిలోమీటర్ల మేర కొత్త మార్గాల నిర్మాణం చేపట్టబోతుండగా, ఫేజ్-2బి కింద మరో 86.1 కిలోమీటర్ల విస్తరణ కోసం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. ఈ విస్తరణ పూర్తయితే హైదరాబాద్ ప్రజా రవాణా వ్యవస్థ అంతర్జాతీయ స్థాయికి చేరుకుంటుందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది. నగరంలో వేగంగా పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మెట్రో సేవలను మెరుగుపరచడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం. ప్రభుత్వం నేరుగా నిర్వహణ బాధ్యతలు చేపట్టడం వల్ల భవిష్యత్తులో టిక్కెట్ ధరల నియంత్రణ, మెరుగైన సౌకర్యాలు , కొత్త మార్గాల అనుసంధానం మరింత సులభతరం కానుంది.

# ఐపీఎల్ 2026లో ఆర్సీబీ బోణీ

మొదటి తరువాయి

లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్సీబీ ఆదిలోనే షాక్ తగిలింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ 7 బంతుల్లో 8 రన్స్ చేసిన తర్వాత ఔట్ అయ్యాడు. అయితే ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన దేవ్‌దత్ పడిక్కల్‌తో విరాట్ కోహ్లీ .. మెరుపు భాగస్వామ్యం నమోదు చేశాడు. తొలుత పడిక్కల్ ఎదురుదాడికి దిగగా.. ఆపై కోహ్లీ కూడా జాయిన్ అయ్యాడు. దీంతో ఆర్సీబీ స్కోరు బోర్డు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. ఎప్పుడెప్పుడు మ్యాచ్ ముగిద్దామా అన్నట్లు ఆర్సీబీ ప్లేయర్లు బ్యాటింగ్ చేశారు.కోహ్లీ, పడిక్కల్ కలిసి మూడో వికెట్‌కు 45 బంతుల్లో 101 రన్స్ చేసి.. జట్టు విజయాన్ని ఖరారు చేశారు. 26 బంతుల్లో 61 రన్స్ చేశాక పడిక్కల్ ఔట్ అయినా.. కోహ్లీ మాత్రం తగ్గలేదు. చివరి వరకు క్రీజులో ఉండి జట్టును గెలిపించాడు. కోహ్లీ ఈ మ్యాచులో 38 బంతుల్లో 69 రన్స్ చేసి అజేయంగా నిలిచాడు. కెప్టెన్ రజత్ పాటీదార్ 12 బంతుల్లో 31 రన్స్ చేసి విజయంలో తన వంతు పాత్ర పోషించాడు. దీంతో ఆర్సీబీ 15.4 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. ఐపీఎల్ 2026ను విజయంతో ఆరంభించింది.అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్ రైజర్స్.. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. ఇషాన్ కిషన్ 38 బంతుల్లో 80 రన్స్ చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆర్సీబీ బౌలర్లలో జాకబ్ డఫీ.. 4 ఓవర్లలో 22 రన్స్ ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్ 2026లో భాగంగా ఆదివారం ముంబై ఇండియన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య మ్యాచ్ జరగనుంది.

# బెట్టింగ్ ఊబిలో పడొద్దు..

మొదటి తరువాయి

ఉంటుందని సజ్జన్నార్ హెచ్చరించారు. బెట్టింగ్ వల్ల అప్పులపాలై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి తెచ్చుకోవద్దు. మీ పరిసరాల్లో ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా మా వాట్సాప్ నంబర్ 94906 16555 కు సమాచారం ఇవ్వండని శనివారం వీడియో షేర్ చేశారు. క్రికెట్ అభిమానులకు ఐపీఎస్-2026 పండుగ మొదలైంది. శనివారం రాత్రి 07:30 గంటలకు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనున్నాయి. ఐపీఎల్ 19వ సీజన్ మే 31 వరకు నిర్వహించనున్నారు. ఈ లీగ్‌లో మొత్తంగా 10 జట్లు తలపడనుండగా.. 74 మ్యాచ్‌లు జరగనున్నాయి. అయితే, ఐపీఎల్ అంటే గుర్తొచ్చే మరో విషయం బెట్టింగ్. ఈ సమయంలో బెట్టింగ్ రాయుళ్లు రెచ్చిపోతుంటారు. అమయాక యువతను లక్ష్యంగా చేసుకుని కోట్లు దండుకుంటుంటారు. ఐపీఎల్ వేళ వందల కోట్ల రూపాయలు చేతులు మారుతుంటాయి. ఈ సందర్భంగా యువతకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ కీలక సూచనలు చేశారు. బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. బెట్టింగ్ వల్ల అప్పులు పెరిగి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దాని జోలికి వెళ్లకుండా క్రికెట్‌ను కేవలం క్రీడగా మాత్రమే ఆస్వాదించాలని యువతకు పిలుపునిచ్చారు.

# గల్ఫ్ దేశాలకు ఇరాన్ వార్నింగ్

మొదటి తరువాయి

ఈ సందర్భంగా పెజెష్కియాన్ ఎక్స్ వేదికగా స్పందించారు. "మేం ముందుగా ఏ దేశంపైనా దాడి చేయబోమని ఎన్నోసార్లు చెప్పాం. మా ఆర్థిక మూలాలు, నిర్మాణాలపై దాడి జరిగినప్పుడు మాత్రమే మేం ఎదురుదాడి చేస్తాం. ఈ ప్రాంతంలోని పొరుగు దేశాలకు చెప్పేదేంటంటే.. శత్రువులు మాపై యుద్ధానికి మీ నేలను వాడుకోనివ్వకండి. అలా చేస్తే శత్రుస్థావరాలు భూస్థాపితం అయ్యేవరకు మేం దాడులు చేస్తూనే ఉంటాం. వారికి సహకరించిన వారిని కూడా వదలబోం" అని ఆయన పేర్కొన్నారు.గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గల్ఫ్ దేశాల్లోని చమురు క్షేత్రాలపై కూడా దాడులు జరిగాయి. దీంతో ఆయా దేశాలకు తీవ్ర నష్టం జరిగింది. దీని ఫలితంగా చమురు ఉత్పత్తి భారీగా తగ్గిపోయే అవకాశం ఉంది. మరోవైపు అమెరికా, ఇరాన్ మధ్య చర్చల ప్రతిపాదన వచ్చింది. కానీ, ఈ విషయం ఒక కొలిక్కి రావడం లేదు. చర్చలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయి.

# బెంగాల్‌ను టార్గెట్ చేస్తే.. కేంద్రంలో బీజేపీని గద్దె దించుతా

మొదటి తరువాయి

ముందుకు వెళ్తానని చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లోని రాణిగంజ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆమె మాట్లాడారు.రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఇళ్ల పైకి బుల్డోజర్లను ప్రయోగించి ప్రజలందరినీ బయటకు గెంటేస్తారని మమత ఓటర్లను హెచ్చరించారు. తమ గెలుపు కోసం దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకుంటూ బీజేపీ నేతలు అన్ని హద్దులను దాటుతున్నారని మండిపడ్డారు. ఆ పార్టీ ఆదేశాల మేరకే ఎన్నికల సంఘం రాష్ట్రంలో ఎలక్షన్స్‌కు ముందు హడావిడిగా 'సర్' ప్రక్రియ చేపట్టిందని ఆరోపించారు. ఓటరు జాబితా నుంచి బెంగాలీ ఓటర్లను తొలగించడానికి ఎన్నికల కమిషన్‌ను బీజేపీ పావులా వాడుకుంటోందని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఉనికి లేకుండా చేయడం, ఆ పార్టీ నుంచి దేశాన్ని రక్షించడమే తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమన్నారు. రాణిగంజ్‌లోని పర్వత ప్రాంతాల్లో తరచూ కొండచరియలు విరిగిపడుతుండడం వల్ల అక్కడి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని మమత ఆవేదన వ్యక్తంచేశారు. ఇటువంటి ప్రమాదకర ప్రాంతాలను విడిచిపెట్టి.. సురక్షిత ప్రాంతాలకు వెళ్లే వారికి తమ ప్రభుత్వం గృహవసతితోపాటు రూ.10 లక్షల ఆర్థికసాయం అందిస్తుందని హామీ ఇచ్చారు. బెంగాల్‌లో గెలువగానే దేశంలోని ఇతర రాజకీయ పార్టీలతో కలిసి కేంద్రంలో బీజేపీని గద్దె దించుతానని హెచ్చరిక చేశారు.

# యుద్ధం ఎఫెక్ట్..

మొదటి తరువాయి

ఈ ధరల పెరుగుదల మరీ ఎక్కువగా ఉన్నట్లు స్థానిక మీడియా కథనాలు తెలుపుతున్నాయి.గ్యాస్ ధరల పెరుగుదల సామాన్య ప్రజల జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఎల్‌పీజీతో నడిచే ఆటోలు, బస్సులు, మినీ బస్సుల రవాణా చార్జీలు పెరగడంతో తక్కువ, మధ్యతరగతి ఆదాయ వర్గాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. మరోవైపు ఈద్, నౌరోజ్ సెలవుల కారణంగా ఇరాన్ నుంచి గ్యాస్ సరఫరా గణనీయంగా తగ్గింది. దాంతో సంక్షోభం మరింత తీవ్రమైంది. పాకిస్థాన్‌లో ఇంధన నిల్వలు కూడా ప్రమాదకర స్థాయిలో అడుగంటిపోయాయి. దేశంలో కేవలం 11 రోజులకు సరిపోయేంత మాత్రమే ముడి చమురు ఉంది.అదేవిధంగా 27 రోజులకు సరిపోయే పెట్రోల్, 21 రోజులకు సరిపోయే డీజిల్, 9 రోజులకు సరిపోయే ఎల్‌పీజీ నిల్వలు ఉన్నాయి. ఈ విషయాన్ని పాకిస్థాన్ పెట్రోలియం శాఖ కార్యదర్శి సెనేట్ కమిటీకి తెలిపారు. పాకిస్థాన్ తన పెట్రోలియం అవసరాల్లో దాదాపు 70 శాతం మధ్యప్రాచ్యం నుంచే దిగుమతి చేసుకుంటున్నది. ప్రస్తుత సంక్షోభంవల్ల సరఫరా మార్గాలు దెబ్బతిన్నాయి. సరఫరాలో అంతరాయాల కారణంగా ఏప్రిల్ 14 తర్వాత దేశంలో తీవ్రమైన గ్యాస్ కొరత ఏర్పడవచ్చని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## సంపాదకీయం

# బతుకులు ‘బుగ్గి’పాలు!



రోజువారి చెమటోడ్చి పొట్టనింపుకునే చేతులు..కుటుంబపోషణ కోసం ప్రయాణించిన పాదాలు.. ఒక్క క్షణంలో అగ్నికి ఆహుతైపోయాయి. ఏపీలోని మార్కాపురం దగ్గర రాయవరం సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదం రవాణా వ్యవస్థలోని లోపాలను మరోసారి బహిర్గతపరిచింది. ప్రయివేటు బస్సు, టిప్పర్ ఢీకొన్న ఘటనలో పద్నాలుగు మంది సజీవ దహనమవ్వడం తీవ్ర విషాదం. ప్రాణాలు కోల్పోయిన వారంతా కూలీలే కావడం మరీ హృదయ విదారకం. ఉన్న ఊరును, కన్నవారిని వదిలి ఉపాధి కోసం వలసొచ్చిన వారు, చివరకు కుటుంబాలనే అంధకారంలోకి నెట్టారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వాల, ప్రయివేటు యాజమాన్యాల నిర్లక్ష్యమే! ఎందుకంటే, గతేడాది కర్నూల్‌లో జరిగిన ఘటనలో ఇలాగే పందొమ్మిది మంది అసువులు బాశారు. చేవెళ్లలో టిప్పర్ ఆర్టీసీ బస్సును ఢీకొట్టడంతో ఇరవై మందివరకు కంకర కుప్పల్లోనే ఊపిరొదిలారు. ఇలా వరుస ఘటనలు జరుగుతున్నా అధికారులు పాఠాలు నేర్వక పోవడం విచారకరం.

తాజా ఘటనలో మృతుల వివరాలు చూస్తే సామాన్యుల దుస్థితి స్పష్టమవుతోంది. వారంతా బతుకుదెరువు కోసం ఏపీ నుంచి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలకు వలసొచ్చిన కూలీలు. కొందరు ఇటుకబట్టీల్లో పనిచేస్తే మరికొందరు భవన నిర్మాణరంగాల్లో స్థిరపడ్డారు. రోజూ పనిచేస్తేనే నాలుగువేళ్లూ నోట్లోకి వెళ్తాయి, లేదంటే పస్తులే. ఆస్తిపాస్తులేమీ లేవు. వచ్చే పదోపరకతోనే కుటుంబాన్ని పోషించుకుంటారు. శ్రీరామనవమి సందర్భంగా కొందరు, ఆప్తులను చూసొద్దామని మరికొం దరు సొంతూళ్లకు బయలుదేరారు. కానీ, వారి బతుకులు కన్నవారిని కలుసుకోకుండానే తెల్లారి పోయాయి. వారు ప్రయాణించిన హరేకృష్ణ ట్రావెల్స్‌కు చెందిన ప్రయివేటు బస్సు కూడా పూర్తిగా వారిని అభద్రతలోకే నెట్టేసింది. బస్సుకు మరమ్మతులు చేయించాల్సి ఉన్నా పట్టించుకోలేదు. గమ్యస్థానానికి మరో మూడు గంటల సమయం ఉందనగా స్టీరింగ్ అదుపు తప్పి నేరుగా టిప్పర్ డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. వెంటనే అంటుకున్న మంటలు ప్రయాణికులను అగ్నికీలల్లో ముంచేశాయి. ఇన్ని వందల కిలోమీటర్ల మధ్య బస్సు ఫిట్‌నెస్‌ను ఒక్క అధికారి కూడా పరిశీలించక పోవడం ఇక్కడ ఆశ్చర్యకరం. డ్రైవర్లలో ఎవరిది తప్పన్నది కాసేపు పక్కన బెడితే అమాయకులు చనిపోయారు. బాధ్యత ఎవరు వహిస్తారు? పాలకులా, ప్రయివేటు యజమానులా? కండీషన్ లేని బస్సును బయటకు తీసుకురావడం ప్రమాదానికి అసలు కారణం. అరుణాచల్‌ప్రదేశ్‌లో రిజిస్టర్ అయిన బస్సు తెలంగాణ, ఏపీల్లో తిరుగుతుంటే పర్యవేక్షించి సీజ్ చేయకపోవడం అధికారుల అలసత్వం. ఏదైనా ఘటన జరిగినప్పుడు హడావిడి చేయడమే తప్ప, ప్రమాదాలు జరగకుండా అధికార యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు పూర్తిగా శూన్యం! ప్రయివేటు ట్రావెల్స్‌కు లాభాలే ముఖ్య మన్నది తెలిసిందే. డ్రైవర్లకు సరైన విశ్రాంతి కూడా ఇవ్వడం లేదనే విమర్శలు అనేకం. ఎమర్జెన్సీ డోర్లు, ఫైర్‌సెఫ్టీ వ్యవస్థలు పనిచేయక పోవడం వంటివి కోకొల్లలు. రాత్రి ప్రయాణాల్లో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం, పర్యవేక్షించే నెట్‌వర్క్ లేకపోవడం వీటికి అదనం. ఇక ఫిట్‌నెస్ తనిఖీల్లో అవినీతి, కేవలం కాగితాలపైనే పరిశీలనలు ‘మామూలే’! ఇవి మన వ్యవస్థలో దాగున్న లోపాలు. చేవెళ్లలో జరిగిన ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కచెల్లెళు చనిపోయిన ఘటన మన మనసును ఇప్పటికీ కలచివేస్తూనే ఉంది. ఇప్పుడు ఏపీలో జరిగిన ప్రమాదంలోనూ అదే కథ. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు సోదరులు ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబమే ఇప్పుడు కూలిపోయింది. ఇంకోచోట వృద్ధ తల్లిదండ్రులను చూసుకునే ఏకైక కుమారుడు మృతిచెందడంతో వారికి ఆధారమే లేకుండా పోయింది. కాగా అభంశుభం తెలియని చిన్నపిల్లలు వారి తండ్రికోసం ఎదురు చూస్తుండగా విన్న మరణవార్త వారి భవిష్యత్తునే చీకట్లోకి నెట్టేసింది. ప్రాణాలు కోల్పోయిన కూలీల కుటుంబాల రోదన మాటల్లో చెప్పలేం. ‘మా వాళ్లు ఏం పాపం చేశారు? ఎందుకు మాకీశోకం?’ వారి కన్నీళ్లు పాలకులపై ఇప్పుడు ప్రశ్నలుగా నిలుస్తున్నాయి. ప్రతి ప్రమాదం తర్వాత విచారణలు, పరిహారం ప్రకటనలు వస్తున్నా మూల కారణాలపై చర్యలు మత్రం కనిపించడం లేదు. తనిఖీల్లో నిర్లక్ష్యం, ట్రాఫిక్ నియమాల అమలులో బలహీనత, ఇవే ప్రమాదాలకు కారణాలుగా నిలుస్తున్నాయి. ఇలాంటివి మీడియాలో వచ్చినప్పుడో, లేదంటే మరేదైనా ఘటన జరిగినప్పుడో తప్ప మన అధికారుల స్పందన ‘అంతంత’ మాత్రమే! ఇకనైనా తెలుగు రాష్ట్రాల్లోని పాలకులు మేల్కోవాలి. ప్రయివేటు ట్రావెల్స్‌పై కఠిన నియంత్రణలు అమలుచేయాలి. ప్రజల ప్రాణాలు లాభాలకంటే విలువైనవని గుర్తించాలి. లేదంటే, ఇలాంటి ప్రమాదాలు పేదల జీవితాలను నిత్యం ఛిద్రం చేస్తూనే ఉంటాయి.

# ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేద్దాం

**-నాయుడుపేటలో టిడ్కో గృహాలప్రారంభోత్సవం**
**-కొండేపాటి గంగాప్రసాద్**



**మార్చ్ 28 తిరుపతి జిల్లా (నాయుడుపేట) మహాప్రభ** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పేదవానికి సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని ప్రముఖ పారిశ్రామికవేత్త, తెలుగుదేశం పార్టీ నాయకులు కొండేపాటి గంగాప్రసాద్ పిలుపునిచ్చారు.

ఈ నెల 30న నాయుడుపేట మండలం బిరదవాడలో నిర్వహించనున్న టిడ్కో గృహాల ప్రారంభోత్సవానికి విచ్చేయనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను ఆయన కోరారు. ఈ నేపథ్యంలో సూళ్లూరుపేట నియోజకవర్గానికి చెందిన అన్ని మండలాల అధ్యక్షులు, కార్యకర్తలతో శనివారం నాయుడుపేటలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. నెలవల సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కొండేపాటి గంగాప్రసాద్ హాజరై పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కొండేపాటి గంగాప్రసాద్ మాట్లాడుతూ, టిడ్కో గృహాల ప్రారంభోత్సవం రాష్ట్ర స్థాయి ప్రాధాన్యత కలిగిన కార్యక్రమమని, ముఖ్యమంత్రి మన ప్రాంతానికి రావడం గర్వకారణమని తెలిపారు. ఈ సభను ఘనంగా నిర్వహించి ప్రభుత్వ సంకల్పాన్ని ప్రజల్లో మరింత బలంగా చాటాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులందరూ సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఇదే సమావేశంలో ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. నాయుడుపేట మాజీ ఏఎంసీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, గత మూడు దశాబ్దాలుగా పార్టీకి సేవలందిస్తున్న కొండేపాటి గంగాప్రసాద్ చట్టసభలోకి అడుగుపెట్టాలనే నాయకులు, అభిమానుల ఆకాంక్షను నెరవేర్చాలని కోరారు. దీనికి స్పందించిన కొండేపాటి గంగాప్రసాద్, తెలుగుదేశం పార్టీపై తనకు అపారమైన అభిమానం ఉందని, పార్టీకి ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తానని, అయితే ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలనే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు.

# తూప్రాన్ చెరువుకట్ట వీరాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు





**తూప్రాన్ మార్చి 28(మహాప్రభ):** మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని చెరువుకట్టపై ప్రకృతి మమేకమైన ఆహ్లాదకరమైన వాతావరణంలో స్వయంభువుగా వెలసిన శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం, ఆలయ పురోహితులు శ్రీ శలాక ఆత్రేయ శర్మ అధ్వర్యంలో హనుమాన్ జయంతి ఉత్సవాలకు ముస్తాబు చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం నాడు హనుమాన్ మాలధారణ గురు స్వామి ఆలయ పురోహితులు ఆత్రేయ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ మాలధారణ స్వాములు హనుమాన్ చాలీసా పారాయణము దండకము, నిత్యం దైవ నామస్మరణతో జపాలు , రామకోటి కార్యక్రమాలు అలాగే శ్రీ సీతారాములు హనుమాన్ దేవుళ్ల భజన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం తూప్రాన్ వాస్తవ్యులు బాయికాడి వెంకటేష్ ఆధ్వర్యంలో హనుమాన్ మాలధారణ స్వాములకు మహా అన్నదాన ప్రసాదం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హనుమాన్ మాలధారణ గురు స్వామి ఆత్రేయ శర్మ, మచ్చ యాదగిరి, నాగరాజ్ , కౌన్సిలర్ జైపాల్ రాథోడ్, దుర్గం నాగేష్ మాట్లాడుతూ అన్ని దానాల కన్నా అన్నదానం మహా గొప్పదని , అన్నదానం పుణ్యకార్యమని తెలిపారు. అన్నదానం నీళ్ల దానం చేయడం ఆ భగవంతుడు ఇచ్చిన వరం అని భావిస్తున్నామని తూప్రాన్ చెరువు కట్ట వీరాంజనేయ స్వామి ఆలయం ఎన్నో ఏళ్లుగా దేదీప్యమానంగా వెలుగొందుతూ నిత్య పూజలు అందుకుంటూ ఉందని తెలిపారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పురోహితులు గురు స్వాములు శ్రీ శలాక ఆత్రేయ శర్మ, మచ్చ యాదగిరి, చిన్న లింగ్ మల్లికార్జున్ గౌడ్, నాగరాజ్ యాదవ్, నవీన్, లక్ష్మణ్ , నవీన్ చారి, దయానంద్ గౌడ్, గడ్డం ప్రశాంత్ కుమార్, అజయ్, యాదగిరి, మురారి, దేవత సాయికిరణ్, భాస్కర్, రేపల్లె నాగరాజు, లోహిత్, బాబు గౌడ్, హనుమాన్ మాలధారణ స్వాములు పాల్గొన్నారు.

# డాలర్ల వేట.. పేదవాడి కన్నీటి మూట..!



అంతర్జాతీయ విపణిలో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 110 డాలర్ల మార్కును దాటడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఒక అశనిపాతం. పశ్చిమాసియాలో ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య రాజుకున్న యుద్ధ జ్వాలలు కేవలం భౌగోళిక సరిహద్దులకే పరిమితం కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ప్రతి సామాన్యుడి వంటింట్లో మంటలు పుట్టిస్తున్నాయి. సరఫరా గొలుసు చెల్లాచెదురై, రవాణా రంగం స్తంభించిపోయే పరిస్థితి తలెత్తడం ద్రవ్యోల్బణ రక్కసికి ఆహారాన్నిస్తోంది.

**దిగుమతుల భారం -- రూపాయి క్షీణత**

భారతదేశం తన చమురు అవసరాల్లో 85 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. బ్యారెల్ ధరలో ప్రతి 10 డాలర్ల పెరుగుదల, మన దేశ కరెంట్ అకౌంట్ లోటును (జూణ) సుమారు 0.5% పెంచుతుంది. ఇది విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి తెచ్చి, రూపాయి విలువను డాలర్‌తో పోలిస్తే రికార్డు స్థాయికి పడిపోయేలా చేస్తోంది. ఫలితంగా దిగుమతి చేసుకునే ప్రతి వస్తువు ప్రియమై, దేశీయంగా వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.

**రవాణా ఖర్చుల దెబ్బ -- నిత్యావసరాల మోత**

ముడి చమురు ధర పెరిగితే అది కేవలం పెట్రోల్, డీజిల్‌కే పరిమితం కాదు. డీజిల్ ధర పెరిగితే లారీ రవాణా చార్జీలు పెరుగుతాయి. దీనివల్ల పొలం నుండి మార్కెట్‌కు వచ్చే కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాల ధరలు అమాంతం పెరుగుతాయి. ఇప్పటికే ద్రవ్యోల్బణం 6% దాటి ఉన్న తరుణంలో, ఈ అదనపు భారం సామాన్యుడి నెలవారీ బడ్జెట్‌ను అస్తవ్యస్తం చేస్తోంది. రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లను పెంచక తప్పని పరిస్థితి ఏర్పడితే, గృహ, వాహన రుణాల భారం కూడా పెరిగే ప్రమాదం ఉంది.

**ప్రభుత్వానికి సవాలు -- వ్యూహాత్మక పరిష్కారం**

ఇలాంటి సంక్షోభ సమయాల్లో కేవలం ఎక్సైజ్ సుంకాలు తగ్గించడం తాత్కాలిక ఉపశమనం మాత్రమే ఇస్తుంది. దీర్ఘకాలికంగా భారత్ తన ఇంధన భద్రతను (జుఅవతీస్త్రఎ Security) కాపాడుకోవడానికి మూడు అంచెల వ్యూహాన్ని అమలు చేయాలి:

1. **వ్యూహాత్మక నిల్వలు** (Strategic Reserves): తక్కువ ధర ఉన్నప్పుడు నిల్వ చేసుకున్న చమురును ఇలాంటి అత్యవసర సమయాల్లో వినియోగించాలి.
2. **ప్రత్యామ్నాయ ఇంధనాలు**: ఇథనాల్ బ్లెండింగ్ శాతాన్ని యుద్ధ ప్రాతిపదికన పెంచాలి.
3. **గ్రీన్ ఎనర్జీ మిషన్:** ఎలక్ట్రిక్ వాహనాలు (జుఎ) మరియు గ్రీన్ హైడ్రోజన్ వైపు మళ్ళడం ఇప్పుడు ఒక ఎంపిక కాదు, అనివార్యమైన అవసరం.


అంతర్జాతీయ గొడవలు ఎక్కడో జరుగుతున్నా, దాని ఫలితం మాత్రం ఇక్కడి సగటు మనిషి పళ్లెం మీద కనిపిస్తోంది. యుద్ధ తంత్రాల మధ్య ఆర్థిక వ్యవస్థ చిక్కుకోకుండా ఉండాలంటే ‘ఆత్మనిర్భర భారత్’ కేవలం నినాదంగా కాకుండా, ఇంధన స్వయం సమృద్ధి దిశగా ఒక ఆచరణాత్మక అడుగు కావాలి. ప్రభుత్వం పన్నుల భారాన్ని కొంత తగ్గించి, సామాన్యుడిని ఈ ద్రవ్యోల్బణ సుడిగుండం నుండి రక్షించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.



Mr.నక్క రాజు
Chairman of
Namastey Mahaaprabha

# తూప్రాన్ ఆయుర్వేద ఆసుపత్రికి పెరుగుతున్న ఆదరణ

-తూప్రాన్ ఆయుర్వేద ఆసుపత్రి -- సహజ వైద్యానికి చిరునామా
-పేషంట్ల నమ్మకానికి నిలయం
తూప్రాన్ ఆయుర్వేద ఆసుపత్రి
-సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాణి శర్మ



**తూప్రాన్, మార్చి 28 (మహా ప్రభ)**
మెదక్ జిల్లా తూప్రాన్‌లోని ఆయుర్వేద ఆసుపత్రి ప్రస్తుతం ప్రజలకు నమ్మకమైన వైద్య సేవల కేంద్రంగా మారుతోంది. వైద్యులు రోగుల పట్ల చూపుతున్న శ్రద్ధ, అందిస్తున్న నాణ్యమైన చికిత్సల వల్ల ఈ ఆసుపత్రికి రోజురోజుకు ఆదరణ గణనీయంగా పెరుగుతోంది.

ప్రతి రోజూ ఆసుపత్రి పేషంట్లతో కిటకిటలాడుతోంది. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు ఆయుర్వేద చికిత్సల కోసం పెద్ద సంఖ్యలో ఇక్కడికి వస్తున్నారు. రోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మందులను ప్రత్యేకంగా సిద్ధం చేసి, ఖరీదైన ఔషధాలను ఉచితంగా అందించడం ఈ ఆసుపత్రి ప్రత్యేకతగా నిలుస్తోంది. ఇంచార్జి సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాణి శర్మ మాట్లాడుతూ "రోగులకు సహజసిద్ధమైన వైద్యంతో శాశ్వత పరిష్కారం అందించడం మా లక్ష్యం" అని తెలిపారు. ఆసుపత్రిలో ఆధునిక పద్ధతులతో పంచకర్మ చికిత్సలు అందుబాటులో ఉండగా, మహిళా మరియు పురుష వైద్య సిబ్బంది సమర్థంగా సేవలందిస్తున్నారు అని అన్నారు. ఆసుపత్రిలో డాక్టర్ పి. ప్రవీణ్ కుమార్, డాక్టర్ టి. భవానీ శంకర్, డాక్టర్ కే. బ్లెస్సి వంటి వైద్యులు, ఫార్మసిస్టులు, ఫిజియోథెరపిస్టులు కలిసి సమగ్ర వైద్య సేవలను అందిస్తున్నారు. ఇన్ పేషెంట్ విభాగం ప్రస్తుతం పూర్తిగా నిండి ఉండగా, మరిన్ని రోగులు చేరేందుకు ఎదురుచూస్తున్నారు. ఔట్ పేషెంట్ విభాగంలో కూడా ప్రతి రోజూ రోగుల సంఖ్య పెరుగుతోంది అని తెలిపారు. సహజ వైద్యానికి పెరుగుతున్న ప్రాధాన్యం ఇటీవలి కాలంలో సైడ్ ఎఫెక్ట్స్ లేని చికిత్సలపై ప్రజల్లో అవగాహన పెరగడంతో ఆయుర్వేద వైద్యానికి ప్రాధాన్యం పెరిగింది అని అన్నారు. తూప్రాన్ ఆయుర్వేద ఆసుపత్రిలో రోగుల అవసరాన్ని తీర్చుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తోంది అని అన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న తూప్రాన్ ఆయుర్వేద ఆసుపత్రి, భవిష్యత్తులో మరింత విస్తృత సేవలతో ప్రజలకు చేరువవుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో నిశ్శబ్దంగా కానీ నిబద్ధతతో సాగుతున్న ఒక వైద్య విప్లవం ఇప్పుడు ప్రజల దృష్టిని ఆకర్షిస్తోంది. అది తూప్రాన్ ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి. ఆధునిక వైద్యానికి ప్రత్యామ్నాయంగా, సహజ సిద్ధమైన చికిత్సలతో రోగులకు శాశ్వత ఆరోగ్యాన్ని అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్న ఈ ఆసుపత్రి, ప్రస్తుతం ప్రజల నమ్మకానికి ప్రతీకగా నిలుస్తోంది. పేషంట్లతో కిటకిటలాడుతున్న ఆసుపత్రి ప్రతి ఉదయం ఆసుపత్రి గేటు తెరుచుకునే సరికి రోగులతో నిండిపోతుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి, సమీప పట్టణాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో రోగులు ఇక్కడికి తరలి వస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులు, సంయుక్త నొప్పులు, నాడీ సంబంధ సమస్యలు, చర్మ వ్యాధులు వంటి సమస్యలతో బాధపడుతున్నవారు ఇక్కడి వైద్యంపై విశ్వాసం ఉంచుతున్నారు. ఔట్‌పేషెంట్ విభాగంలో ప్రతి రోజు రోగుల సంఖ్య పెరుగుతుండగా, ఇన్‌పేషెంట్ విభాగం పూర్తిగా నిండి ఉండటం ఆసుపత్రి సేవలపై ఉన్న ఆదరణకు నిదర్శనం. ఇంకా బెడ్లు ఖాళీ అయ్యేంత వరకు వేచి ఉండేందుకు సిద్ధంగా ఉన్న రోగులు కూడా ఉన్నారు. రోగికి అనుగుణంగా చికిత్స -- ఆసుపత్రి ప్రత్యేకత ఇక్కడ ప్రతి రోగిని ఒకే విధంగా కాకుండా, వారి శరీర స్వభావం, వ్యాధి తీవ్రతను బట్టి చికిత్స అందించడం ప్రధాన లక్షణం. ఆయుర్వేద సూత్రాల ప్రకారం మందులు సిద్ధం చేసి, ఖరీదైన ఔషధాలను కూడా ఉచితంగా అందించడం ప్రజలకు పెద్ద ఉపశమనం కలిగిస్తోంది. ఇంచార్జి సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాణి శర్మ మాట్లాడుతూ, "ప్రతి రోగి ఆరోగ్య సమస్యకు మూల కారణాన్ని గుర్తించి, సహజసిద్ధమైన పద్ధతుల్లో శాశ్వత పరిష్కారం అందించడం మా లక్ష్యం" అని స్పష్టం చేశారు. పంచకర్మతో దీర్ఘకాలిక రోగాలకు ఉపశమనం ఆసుపత్రిలో అందిస్తున్న పంచకర్మ చికిత్సలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. శరీరాన్ని శుద్ధి చేసి, దోషాలను సమతుల్యం చేసే ఈ చికిత్సలు దీర్ఘకాలిక రోగాలకు ఎంతో ప్రయోజనకరంగా మారాయి. మహిళా, పురుషుల కోసం ప్రత్యేకంగా శిక్షణ పొందిన సిబ్బంది ఈ చికిత్సలను సమర్థంగా అందిస్తున్నారు. సమగ్ర వైద్య బృందం సేవలు ఆసుపత్రిలో డాక్టర్ రాణి శర్మ ఆధ్వర్యంలో డాక్టర్ పి. ప్రవీణ్ కుమార్, డాక్టర్ టి. భవానీ శంకర్, డాక్టర్ కే. బ్లెస్సి వంటి వైద్యులు సేవలందిస్తున్నారు. వారికి తోడుగా ఫార్మసిస్టులు, ఫిజియోథెరపిస్టులు, సపోర్ట్ స్టాఫ్ కలిసి రోగులకు సమగ్ర వైద్యం అందిస్తున్నారు. ఫిజియోథెరపీ సేవలు కూడా అందుబాటులో ఉండటం వల్ల శరీర నొప్పులు, కండరాల సమస్యలు ఉన్న రోగులకు అదనపు ఉపశమనం లభిస్తోంది. గ్రామీణ ప్రజలకు వరంగా మారిన ఆసుపత్రి ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఖర్చులు భరించలేని గ్రామీణ ప్రజలకు ఈ ఆసుపత్రి ఒక వరంలా మారింది. తక్కువ ఖర్చుతో, లేదా పూర్తిగా ఉచితంగా నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండటం వల్ల పేద ప్రజలు పెద్ద సంఖ్యలో ఇక్కడికి వస్తున్నారు. సహజ వైద్యంపై పెరుగుతున్న అవగాహన ఇటీవలి కాలంలో సైడ్ ఎఫెక్ట్స్ లేని చికిత్సలపై ప్రజల్లో అవగాహన పెరిగింది. ఈ నేపథ్యంలో ఆయుర్వేద వైద్యానికి ఆదరణ మరింతగా పెరుగుతోంది. తూప్రాన్ ఆసుపత్రి ఈ అవసరాన్ని తీర్చుతూ ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పిస్తోంది. భవిష్యత్తుపై ఆశలు ప్రస్తుతం ఉన్న సదుపాయాలను మరింత విస్తరించి, ఎక్కువ మంది రోగులకు సేవలు అందించాలనే లక్ష్యంతో ఆసుపత్రి ముందుకు సాగుతోంది. అదనపు బెడ్లు, ఆధునిక పరికరాలు, మరిన్ని వైద్య సిబ్బంది అందుబాటులోకి వస్తే, ఈ ఆసుపత్రి రాష్ట్ర స్థాయిలో ఆదర్శంగా నిలుస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడమే ధ్యేయంగా, సహజ వైద్యంతో శాశ్వత పరిష్కారాన్ని అందిస్తూ తూప్రాన్ ఆయుర్వేద ఆసుపత్రి ఒక నమ్మకమైన వైద్య కేంద్రంగా అవతరించింది. నిబద్ధత, సేవాభావం, నాణ్యత---ఈ మూడు విలువలతో ముందుకు సాగుతున్న ఈ ఆసుపత్రి, భవిష్యత్తులో మరింత పెద్ద సేవా సంస్థగా ఎదగడం ఖాయం.

# వడ్డేపల్లి చల్మా రెడ్డి మృతి బాధాకరం

-బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



**దేవరకొండ మార్చి 28( మహాప్రభ )**
దేవరకొండ మండలం ముదిగొండ గ్రామానికి చెందిన వడ్డేపల్లి దామోదర్ రెడ్డి తండ్రి చల్మా రెడ్డి మృతి బాధాకరం అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. శనివారం దేవరకొండ మండలం ముదిగొండ గ్రామంలో చల్మా రెడ్డి మృత దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... చల్మా రెడ్డి మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆయన భగవంతుని ప్రార్థించారు. ఆయన వెంట మండల అధ్యక్షులు ౹ఎచీ రెడ్డి, జైహింద్ రెడ్డి, కాశిరెడ్డి రవీందర్ రెడ్డి, రేపాని ఇద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షులకు, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులకు ఘన సన్మానం





**దేవరకొండ మార్చి 28 ( మహాప్రభ )**
జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ కమిటీకి సన్మానం, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన అనిత సురేష్ గాళ్లకు ఘన సన్మానం దేవరకొండ పట్టణంలో నూతనంగా ఎన్నికైన బార అసోసియేషన్ మరియు విజిలెన్స్ కమిటీ సభ్యులకు ఘన సన్మానం చేశారు .బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా సన్నాయిల ఉమామహేశ్వర్ ప్రధాన కార్యదర్శిగా వనం జగదీశ్వర్ కోశాధికారిగా ఈడెం రవికుమార్ లను షాలువతో సత్కరించి మెమొంటోళ్లు అందించారు శుభాకాంక్షలు తెలిపారు జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన ఏ కుల అనిత సురేష్ శాలువాతో సత్కరించి మెమొంటో అందించి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూమీరంతా భవిష్యత్తులో ఉన్నత పదవులు అలంకరిస్తూ ఉన్నత శిఖరాల అధిరోహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజాసేవలో ముందుకెళ్తూ ప్రజల మన్నలను పొందాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో పున్న వెంకటేష్ నేత ,డబ్బే కార్ పెంటోజి పున్న బిక్షమయ్య, పెరికేటి శ్రీనివాస్ చారి, రెడ్డి కోటేశ్వరరావు, జూలూరి రేణు గౌడ్,లైబ్రేరియన్ శారద, కె పెద్దిరాజుతదితరులు పాల్గొన్నారు

# లోక్ అదాలత్ లో 837 కేసులు పరిష్కారం: సివిల్ జడ్జి కె. అనిత




**దేవరకొండ మార్చి 28( మహాప్రభ )**
దేవరకొండ లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలతో 837 కేసులు పరిష్కారమైనట్లు మండల న్యాయ సేవాధికార సమస్త చైర్మన్, సివిల్ జడ్జి కె. అనిత తెలిపారు. కక్షిదారులు రాజీమార్గాన్ని అనుసరించి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. సివిల్ సూట్ 11, క్రిమినల్ కేసులు 142, సి సి అడ్మిషన్స్ 55, ఈ- పెట్టి కేసులు 623, పి. ఎల్. సి 5 కేసులు పరిష్కారమైనాయని ఆమె తెలిపారు

# ఘనంగా బోనాల ఊరేగింపు



**పాపన్నపేట, మార్చి 28 (మహా ప్రభ )**
మండల కేంద్రం పాపన్నపేటలో శ్రీరామనవమి జాతర ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం గ్రామంలో బోనాల ఊరేగింపు కార్యక్రమం పాత చెరువు కట్ట మీదుగా వెంకటేశ్వర గుట్ట వరకు కన్నుల పండువగా సాగింది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ పావని నరేందర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# జాతరలో మంచి నీటి పంపిణీ



**పాపన్నపేట, మార్చి28 ( మహా ప్రభ )**
పూర్వ విద్యార్థులు జాతరలో తమ సేవా భావాన్ని చాటుకున్నారు. శ్రీరామనవమి జాతర ఉత్సవాలలో పాపన్నపేట ప్రభుత్వ జడ్పీ పాఠశాలలో 2003-2004 లో చదివిన విద్యార్థులు వివిధ గ్రామాల నుంచి పాపన్నపేట వెంకటేశ్వర స్వామి జాతరకు తరలి వచ్చే భక్తులకు ఉచిత మంచి నీటిని పంపిణీ చేశారు. గత 11 ఏండ్లుగా ఈకార్యక్రమాన్ని వారు నిర్వహించడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

## సీసీ రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు,



**దేవరకొండ మార్చి 28( మహాప్రభ )**
దేవరకొండ పట్టణంలో శనివారం 20 వార్డులో సిసి రోడ్లు పనులుగత రెండు రోజుల నుంచి వేగంగా జరుగుతున్నాయి ప్రధానంగా వార్డులోని ఐబి వెనకాల స్వర్ణకార వీధి వెంట ఇరువైపులా రోడ్ల పనులను చేపట్టడం జరిగిందని మున్సిపల్ చైర్ పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు తెలిపారు. మూడు రోజులలో పనులు పూర్తి చేయనున్నట్లు రోడ్లను నాణ్యతతో వేయడం జరుగుతుందని ఆమె తెలిపారు . వారి వెంట మున్సిపల్ ఏఈ రాజు సిబ్బంది లు ఉన్నారు.

# జాతీయ లోక్ అదాలత్ ప్రారంభం

## త్వరిత పరిష్కారాలకు ఉత్తమ వేదిక:




**కామారెడ్డి, మార్చి 28:(మహా ప్రభ)**
జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లా న్యాయమూర్తి డా. సీహెచ్. వీవీఆర్ వరప్రసాద్, ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, క్షణికావేశంలో ఏర్పడిన వివాదాలను సులభంగా, వేగంగా పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ ఉత్తమ వేదికగా నిలుస్తుందని తెలిపారు. అనవసర తగాదాలకు దూరంగా ఉండి, పరస్పర అవగాహనతో సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు.జిల్లా వ్యాప్తంగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన కేసులు లోక్ అదాలత్ ద్వారా త్వరితగతిన పరిష్కారం పొందవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

**రాజీ పడదగిన కేసులు ఇవి:**
క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ వివాదాలు, ఆస్తి విభజన, కుటుంబ, వైవాహిక తగాదాలు, బ్యాంకు రికవరీ కేసులు, చెక్ బౌన్స్ కేసులు తదితరాలలో పరస్పర సమ్మతితో రాజీ సాధ్యమని తెలిపారు. సైబర్ నేరాల విషయంలో రూ.25 వేల లోపు నష్టం జరిగిన కేసుల్లో కోర్టు అనుమతితో ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండానే రీఫండ్ పొందే అవకాశం ఉందని వెల్లడించారు. లోక్ అదాలత్ విజయవంతానికి అధికారులు నుంచి కానిస్టేబుల్ స్థాయి వరకు అందరూ సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ ఆదేశించారు. రాజీ పడదగిన కేసుల్లో ఇరువర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించి ఎక్కువ కేసులను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, అదనపు కలెక్టర్ విక్టర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీసు అధికారులు, కక్షిదారులు, ప్రజలు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



**ఆమనగల్లు, మార్చి 28(మహాప్రభ):**
ఆమనగల్లు మున్సిపాలిటీ 10వ వార్డు విటాయిపల్లికి చెందిన వెంకటయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం గ్రామస్థులు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.వారి కుటుంబాన్ని పరామర్శించి, గ్రామస్థులు కలసి రూ.46,000, అదనంగా ఉప్పల వెంకటేష్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.3,000 సమకూర్చి బాధిత కుటుంబానికి అందజేశారు.

# వార్డు సభ్యుల శిక్షణ పూర్తి -- సర్టిఫికెట్ల పంపిణీ



**తాడ్వాయి, మార్చి 28(మహాప్రభ):**
మండలంలోని వార్డు సభ్యులకు నిర్వహించిన రెండో బ్యాచ్ శిక్షణ కార్యక్రమం శనివారం విజయవంతంగా పూర్తయ్యింది. ఈ సందర్భంగా ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణలో భాగంగా పంచాయతీ రాజ్ చట్టంపై అవగాహన కల్పించారు. ఆదర్శ గ్రామాల అభివృద్ధి, గ్రామపంచాయతీ సమావేశాల నిర్వహణ, రికార్డుల సంరక్షణ వంటి అంశాలపై వివరించారు. అలాగే సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యుల విధులు, బాధ్యతలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. గ్రామాభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని, సమన్వయంతో పనిచేస్తే గ్రామాలు అభివృద్ధి దిశగా ముందుకు సాగుతాయని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో, సవిత రెడ్డి, సెక్రటరీలు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అగ్నివీర్ నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానం



**కామారెడ్డి, మార్చి 28:(మహాప్రభ)**
భారత ప్రభుత్వ అగ్నిపథ్ పథకం కింద భారత సైన్యంలో అగ్నివీర్‌గా చేరేందుకు 2027 సంవత్సరానికి గాను పురుష అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన మరియు క్రీడల అధికారి రంగ వెంకటేశ్వర్ గౌడ్ తెలిపారు. యువజన సర్వీసుల శాఖ ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ అనుమతితో ఈ నియామక ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

**అర్హతలు:**
వివాహం కాని పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు. కనీసం 8వ తరగతి ఉత్తీర్ణత ఉండాలి. అభ్యర్థులు 01.07.2005 నుండి 01.07.2009 మధ్య జన్మించి ఉండాలి. అర్హత కలిగిన కామారెడ్డి జిల్లా యువకులు ఏప్రిల్ 1, 2026 లోపు అధికారిక వెబ్‌సైట్ ద్వారా వివరాలు తెలుసుకుని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని దేశ సేవలో భాగస్వాములు కావాలని యువతను అధికారులు కోరారు.

# తూప్రాన్ గీతా స్కూల్ యాజమాన్యానికి ఉత్తమ విద్యా పురస్కారం



**తూప్రాన్ మార్చ్ 28,(మహాప్రభ)**
విద్యా రంగంలో విశిష్ట సేవలశీదిస్తున్న తూప్రాన్ గీతా స్కూల్ యాజమాన్యానికి హెచ్.ఎం.టీవీ మరియు హన్స్ ఇండియా వారి "విద్యా పురస్కారం" లభించింది. గత మూడు దశాబ్దాలుగా నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక సదుపాయాలు, నైపుణ్యం, విలువలతో కూడిన విద్య, వ్యక్తిగత వికాసం, క్రమశిక్షణ మరియు సృజనాత్మకత లాంటి అంశాల్లో వేలాది విద్యార్థులను ఉన్నత స్థాయికి చేరేలా తీర్చిదిద్దినందుకు గాను ఈ అవార్డు లభించినట్లు పాఠశాల కరస్పాండెంట్ పిన్నక రామాంజనేయులు తెలిపారు. శనివారం నాడు హైదరాబాద్ బాగ్ లింగంపల్లి లోని ఆర్.టీ.సి కళాభవన్లో జరిగిన అవార్డుల కార్యక్రమంలో రాష్ట్ర రవాణా మరియు సినిమాటోగ్రఫీ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా పాఠశాల కరెస్పాండెశీట్ రామాంజనేయులు తోపాటు చైర్ పర్సన్ పి. ఉష, డైరెక్టర్ భరత్ లు ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్బంగా పాఠశాల డైరెక్టర్లు బి.రాఘవేందర్ గౌడ్, కే.నారాయణ గుప్త, మౌనిక, ఇంచార్జి ప్రిన్సిపాల్ ప్రేమ్ రాజ్, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వర్ అలాగే ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

# లోక్‌అదాలత్ వేదికగా 169 కేసులు రాజీ

**-ఇబ్రహీంపట్నం జిల్లా సబ్‌కోర్టులో పరిష్కారం**

**రంగారెడ్డి, మార్చి 28(మహాప్రభ):**
జిల్లా లోక్‌అదాలత్‌లో ఇబ్రహీంపట్నం సబ్‌కోర్టు పరిధిలో శనివారం జరిగిన కార్యక్రమంలో మొత్తం 169 కేసులు రాజీ పడ్డాయి. మాడుగుల, ఫార్మాసిటీ, యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ల పరిధిలోని కేసులు ఈ లోక్‌అదాలత్‌లో పరిష్కారం పొందాయి.

# కట్టుదిట్టమైన పోలీసు భద్రత మధ్య పదవ తరగతి పరీక్షలు

**కామారెడ్డి - మార్చి 28 (మహాప్రభ)**
పరీక్షా కేంద్రాలను స్వయంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ యం రాజేష్ చంద్ర, ఐపీఎస్ పదవ తరగతి వార్షిక పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో, కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాయ్స్ హై స్కూల్, మరియు జీవధాన్ హై స్కూల్, పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ యం రాజేష్ చంద్ర, ఐపీఎస్ స్వయంగా సందర్శించి, అక్కడి ఏర్పాట్లు మరియు భద్రతా చర్యలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తును ఎస్పీ తనిఖీ చేసి, పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ఎటువంటి అంతరాయం లేకుండా సజావుగా కొనసాగుతున్నట్లు నిర్ధారించుకొని, భద్రతా చర్యలను



మరింత బలోపేతం చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 163163 దీఛీ సెక్షన్ కచ్చితంగా అమల్లో ఉండేలా చూడాలని, అనవసరంగా గుమిగూడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల భద్రతకు ఎటువంటి విఘాతం కలగకుండా ప్రతి కేంద్రం వద్ద కట్టుదిట్టమైన భద్రత కొనసాగించాలని స్పష్టం చేశారు.
అలాగే పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణతో పాటు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి పట్టణ ఎస్‌హెచ్‌ఓ నరహరి మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో వాటర్ ప్యూరిఫైయర్ ప్రారంభించిన మేయర్ శ్రీనివాస్




**కరీంనగర్ మార్చి 28(మహాప్రభ):**
కరీంనగర్ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలో తీగలగుట్టపల్లి 1వ అంగన్వాడీ కేంద్రంలో సాక్షం అంగన్వాడీ కార్యక్రమం భాగంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ చేతుల మీదుగా వాటర్ ప్యూరిఫైయర్ ప్రారంభించారు. జిల్లాలోని 269 అంగన్వాడీ కేంద్రాలకు ఒక్కింటికి లక్ష రూపాయలతో ఎల్ఈడీ టీవీ, ఈసీసీఈ మెటీరియల్, రైన్ వాటర్ హార్వెస్టింగ్, బాల పెయింటింగ్, పోషణ వాటిక వంటి సదుపాయాలను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కరీంనగర్ అర్బన్ ప్రాజెక్ట్‌లో 35 అంగన్వాడీ కేంద్రాలకు ఈ సదుపాయాలు అందించనున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో మరిన్ని సదుపాయాలు కల్పించి పిల్లల హాజరు శాతం పెరిగేలా కృషి చేయాలని సూచించారు. ప్రీ స్కూల్ పిల్లలకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. ఈసీసీఈ మేళాలో పిల్లల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సీడీపీఓ సబితా, సూపర్వైజర్లు రాజమణి, శ్రీలత, కనకలక్ష్మీ, డిహెచ్ఈడబ్ల్యూ సిబ్బంది కవిత, శైలజ, పిల్లలు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎలక్ట్రికల్ బస్సులు ఆర్టీసీ ఆధీనంలోనే నడవాలి


**హుస్నాబాద్, మార్చి 28(మహాప్రభ):**



ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ యాజమాన్యం పరిధిలోనే నడపాలని, ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే ఊరుకోబోమని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఎంపీ రెడ్డి హెచ్చరించారు. హుస్నాబాద్ పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సుల విషయంలో కార్మికులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని, కార్మికుల సంక్షేమం కోసం జేఏసీ అండగా నిలిచి పోరాటం చేస్తుందని తెలిపారు. ఆర్టీసీ యాజమాన్యం తీసుకునే నిర్ణయాలు కార్మికులకు అనుగుణంగా ఉండాలని, వ్యతిరేకంగా ఉంటే సహించబోమని స్పష్టం చేశారు. కరీంనగర్ టు డిపోలో ఎలక్ట్రికల్ బస్సులను పూర్తిగా ఆర్టీసీ ఆధీనంలోనే నడపాలని, ప్రైవేట్ సంస్థలకు అప్పగించే అనాలోచిత ధోరణి మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిచో ఈనెల 30న కరీంనగర్ టు డిపో ఎదుట ఆర్టీసీ కార్మికులతో భారీ ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ కే. కొమురయ్య, కన్వీనర్ జే. పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పీహెచ్‌సీలో మెగా వైద్య శిబిరం విజయవంతం


**హుస్నాబాద్, మార్చి 28(మహాప్రభ):**



ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 డేస్ యాక్షన్ ప్లాన్ కింద హుస్నాబాద్ మండలంలోని మిర్జాపూర్ పీహెచ్‌సీలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మైమూనా ఆధ్వర్యంలో, సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి మరియు మెడికల్ కాలేజ్ సూపర్ స్పెషాలిటీ వైద్యుల సహకారంతో నిర్వహించారు. ఆరు విభాగాల వైద్య సేవలు అందించగా, 17 గ్రామాలు మరియు మున్సిపాలిటీ పరిధికి చెందిన సుమారు 180 మంది ప్రజలు ఈ సేవలను వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్య అధికారి డాక్టర్ శ్రీరామ్, హెల్త్ సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, వాలంటరీ వర్కర్లు పాల్గొన్నారు.

# రహదారిని నిర్బంధించిన కంపెనీపై చర్యలు తీసుకోండి.

**- కాళ్ళకల్ పట్టణ యువకులు.**






**మనోహరాబాద్, మార్చి 28. (మహాప్రభ)**
మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కళ్ళకల్ పారిశ్రామిక ప్రాంతంలో ఈ మధ్య కాలంలో సీడ్ కంపెనీ నిర్మించి ప్రారంభించారు. ఇందులో భాగంగా విత్తనాలకు సంబంధించిన భారీ వాహనాలు దారిలో నిలపడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాల్లకల్ నుండి ముప్పిరెడ్డిపల్లి మరియు కొండాపూర్ వెళ్లే రహదారిని వారి వాహనాలతో నిర్బంధించి బాటసారులకు, వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయాన్ని కలిగిస్తున్న హగ్రోనిక్ సీడ్ కంపెనీ. దీని దృష్ట్యా గ్రామస్తులు కంపెనీ వద్దకు వెళ్లి యజమానితో సంప్రదించగా మరొకసారి ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా చూసుకుంటానని చెప్పి తిరిగి ఇదే కోణంలో సీడ్ కు సంబంధించిన వాహనాలను రోడ్డుపైన నిలబడం జరుగుతుందని కాళ్ళకాల్ గ్రామ యువకులు ఒక ప్రకటనలో పేర్కొంటూ తక్షణమే ఉన్నత అధికారులు ఈ కంపెనీ యాజమాన్యం పై రహదారి నిర్బంధ చట్టాల కింద చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు తెలిపారు.

# విజయవంతంగా శిక్షణ పూర్తి చేసిన సర్పంచులు



**శివంపేట, మార్చి 28(మహాప్రభ):**
మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సర్పంచుల శిక్షణ కార్యక్రమాన్ని శివంపేట్ మండలానికి చెందిన పలువురు సర్పంచులు విజయవంతంగా పూర్తి చేశారు. శిక్షణలో భాగంగా పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన, గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడం, సర్పంచ్ , ఉప సర్పంచ్, వార్డు సభ్యుల యొక్క బాధ్యతలు మొదలగు అంశాల పై వివరించారు. శనివారం శిక్షణ ముగింపు సందర్భంగా వారికి సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సమంత రెడ్డి, మమత యాదవ్, విజయ రెడ్డి, మమత, పుష్ప మరియు ఇతర పలువురు శిక్షణ పొందినందుకు హర్షం వ్యక్తం చేశారు.

# దురంధర్ సినిమా ప్రతి ఒక్కరూ చూడాలి

**మంథని, మార్చి 28(మహాప్రభ):**



రామగిరి మండలంలోని సెంటనర్ కాలనీలో బిజెపి ఎంపీటీసీల పోరం మాజీ జిల్లా అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశభక్తి, త్యాగం, స్ఫూర్తి విలువలను ప్రతిబింబించే అద్భుతమైన చిత్రం దురంధర్ ప్రతి భారతీయుడు తప్పనిసరిగా చూడాలని అన్నారు. మన స్వాతంత్ర్యం వెనుక ఉన్న అమూల్యమైన త్యాగాలను గుర్తు చేస్తూ, యువతలో దేశభక్తిని పెంపొందించేందుకు ఈ చిత్రం గొప్ప మార్గదర్శిగా నిలుస్తుందని పేర్కొన్నారు. స్వేచ్ఛగా జీవిస్తున్న ఈ రోజుల్లో మనకు లభించిన స్వాతంత్ర్యం సాధారణ విషయం కాదని, అది ఎన్నో వీరుల పోరాటాలు, త్యాగాల ఫలితమని గుర్తుచేశారు. కాలేజీ విద్యార్థులు, యువత, యజమాన్యాలు ఈ సినిమాను తప్పనిసరిగా చూడాలని, దేశ అభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలనే స్ఫూర్తి కలిగించడంలో దురంధర్ సినిమా గొప్ప పాత్ర పోషిస్తుందని శ్రీనివాస్ అన్నారు.

# బిజినెస్

## నోకియాలో భారీ ఉద్యోగాల కోత .. భారత్‌లోనూ లేఆఫ్‌లు ..!






బిజినెస్ : ఇటీవల అమెజాన్, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి టెక్ దిగ్గజాలు భారీ స్థాయిలో ఉద్యోగాలను కోత పెట్టిన సంగతి విదితమే. ఇప్పుడు టెలికాం రంగంలో కూడా ఉద్యోగాల కోతలు మొదలయ్యాయి.. గత కొన్నేళ్లుగా క్రమక్రమంగా ఉద్యోగులను ఇంటిబాటపట్టిస్తున్న నోకియా ... ఇప్పుడు ఏకంగా 14 వేలమంది ఉద్యోగులను తగ్గించాలని నిర్ణయించింది. వారిలో భారతీయులు కూడా ఉన్నారు.

**20 శాతం కోత ....**

ప్రస్తుతం నోకియాలో ప్రపంచవ్యాప్తంగా సుమారు 74 వేల మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తుండగా .... అందులో దాదాపు 17 వేల మంది భారత్‌లో ఉన్నారు. మొత్తం వర్క్‌ఫోర్స్‌లో సుమారు 20 శాతం కోత విధించాలనే లక్ష్యంతో సంస్థ ముందుకు సాగుతోంది. ముఖ్యంగా భారత్‌లో వ్యాపార ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం ఈ నిర్ణయానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. 2025 చివరి త్రైమాసికంలో కంపెనీ భారత విభాగంలో నికర అమ్మకాలు 15 శాతం పడిపోవడం గమనార్హం.

**అదనపు పదవులు తొలగింపు ....**

ఇక సంస్థలో నాయకత్వ మార్పులు కూడా చోటుచేసుకున్నాయి. ఏప్రిల్ 1, 2026 నుంచి సమర్ మిట్టల్‌ను ఇండియా కంట్రీ బిజినెస్ లీడర్‌గా, విభా మెహ్రాను కంట్రీ మేనేజర్‌గా నియమించారు. ఇంతకుముందు ఈ బాధ్యతలు నిర్వహించిన తరుణ్ ఛబ్రా పదవి నుంచి తప్పుకున్నారు. సంస్థలోని క్లౌడ్ అండ్ నెట్‌వర్క్ సర్వీసెస్, మొబైల్ నెట్‌వర్క్స్ విభాగాల విలీనం వల్ల ఏర్పడిన అదనపు పదవులను తగ్గించేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

**క్రమంగా తగ్గుతున్న ఉద్యోగుల సంఖ్య ..!**

గత కొన్నేళ్లుగా నోకియాలో ఉద్యోగుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోంది. 2018లో లక్షకు పైగా ఉన్న ఉద్యోగుల సంఖ్య ఇప్పుడు గణనీయంగా తగ్గిపోయింది. భారత్‌తో పాటు యూరప్‌లోని గ్రీస్, ఇటలీ, జర్మనీ, ఫ్రాన్స్ దేశాల్లో కూడా సుమారు 1,400 మందిని తొలగించే ప్రక్రియ కొనసాగుతోంది.

## దిమ్మదిరిగే షాకిచ్చిన బంగారం, వెండి ధరలు.. తులంపై భారీగా పెరుగుదల

బంగారం, వెండి ధరలు మళ్లీ పరుగులు పెడుతున్నాయి. గత కొన్ని రోజులుగా రికార్డు స్థాయిలో తగ్గుతున్న బంగారం, వెండి ధరలు.. గత రెండు రోజులుగా పరుగులు పెడుతున్నాయి. భారీగా తగ్గాయని ఆనందపడ్డలోగానే మళ్లీ ఆందోళన కలిగిస్తున్నాయి.తాజాగా మార్చి 28వ తేదీన ఉదయం 10 గంటల సమయంలో బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. 24 క్యారెట్ల 10 గ్రాములపై ఏకంగా 2,510 రూపాయలు పెరిగింది. అదే 22 క్యారెట్ల 10 గ్రాములపై 2,300 వరకు ఎగబాకింది. ఇదే విధంగా 18 క్యారెట్ల 10 గ్రాములపై1880 రూపాయల వరకు పెరిగింది.హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,48,090 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర



రూ.1,35,750 వద్ద ట్రేడవుతోంది. అలాగే 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,11,070 వద్ద కొనసాగుతోంది.ఇక వెండి విషయానికొస్తే దీనిపై కూడా భారీగా పెరిగింది. హైదరాబాద్‌లో ఏకంగా 5 వేల రూపాయల వరకు ఎగబాకింది. కిలో వెండి ధర రూ.2,50,000, ఇతర నగరాల్లో ఇంకాస్త తక్కువగా ఉంది. ముంబై, ఢిల్లీ, బెంగళూరు నగరాల్లో రూ.2,45,000 వద్ద ట్రేడవుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం వ్యాపారం ప్రధానంగా అమెరికన్ డాలర్‌లోనే జరుగుతుంది. డాలర్ బలపడితే ఇతర దేశాల కరెన్సీలతో కొనుగోలు చేసే వారికి బంగారం ఖరీదుగా అనిపిస్తుంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా కొనుగోలు తగ్గుతుంది. డిమాండ్ తగ్గడం వల్ల సహజంగానే బంగారం ధరలపై ప్రభావం పడుతుంది

## నయా రెనో డస్టర్

**హైదరాబాద్,**

రెనో నయా డస్టర్‌ను రాష్ట్ర మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ కారు రూ.10.49 లక్షల నుంచి రూ.18.09 లక్షల లోపు లభించనున్నది.ఎకో ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్స్, రిమోట్ కీలెస్ ఎంట్రీ, 35 భద్రత ఫీచర్లలో భాగంగా ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, టీపీఎంఎస్, హెచ్ఎస్ఏ, ఈఎస్‌పీ, వైర్‌లెస్ స్మార్ట్‌ఫోన్, రియర్ వ్యూ కెమెరా, ఎలక్ట్రిక్ పానోరమిక్ సన్‌రూఫ్ వంటి ఫీచర్స్‌తో తయారు చేసింది.




# స్పోర్ట్స్

## బంగ్లాదేశ్‌లో ఐపీఎల్ ప్రసారాలకు గ్రీన్ సిగ్నల్

**బంగ్లాదేశ్**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ ప్రసారాల విషయంలో బంగ్లాదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో విధించిన నిషేధాన్ని ఎత్తివేస్తూ, ఇకపై ఐపీఎల్ మ్యాచ్‌ల ప్రసారాలకు ఎలాంటి అడ్డంకులు ఉండబోవని స్పష్టం చేసింది. ఈ నిర్ణయం దేశంలోని క్రికెట్ అభిమానులకు ఊరటనిచ్చింది.

అభ్యంతరం లేదు : మంత్రి జహీర్ ఉద్దీన్


బంగ్లాదేశ్ సమాచార, ప్రసార శాఖ మంత్రి మంత్రి జహీర్ ఉద్దీన్ మాట్లాడుతూ .... క్రీడలను రాజకీయాలతో కలపడం తమ ఉద్దేశం కాదని తెలిపారు. ఐపీఎల్ ప్రసారాలను పూర్తిగా వాణిజ్యపరంగా పరిగణిస్తామని, ప్రసార హక్కుల కోసం ఏదైనా ఛానెల్ దరఖాస్తు చేస్తే అనుకూలంగా పరిశీలిస్తామని వెల్లడించారు. అంతర్జాతీయ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లు ప్రసారం చేయడంలో ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. బంగ్లాదేశ్ కేబుల్ ఆపరేటర్ల సంఘం కూడా ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించింది. ప్రసారాలను నిలిపివేయాలని





తమకు ఎలాంటి తాజా ఆదేశాలు లేవని, స్టార్ స్పోర్ట్స్ వంటి ఛానెల్‌లు ఐపీఎల్‌ను ప్రసారం చేస్తే అవి నిరంతరంగా కొనసాగుతాయని వెల్లడించింది. గతంలో మహమ్మద్ యూనుస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వం ఐపీఎల్ ప్రసారాలపై నిషేధం విధించింది. ఆ సమయంలో నెలకొన్న కొన్ని వివాదాస్పద పరిణామాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అయితే, కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంక్షలను పూర్తిగా ఎత్తివేసింది. తాజా పరిణామంతో ఐపీఎల్ 2026 సీజన్ ప్రసారాలకు మార్గం సుగమమవడంతో పాటు, బంగ్లాదేశ్ ప్రేక్షకులు మళ్లీ ఈ ప్రముఖ క్రికెట్ లీగ్‌ను ఆస్వాదించే అవకాశం దక్కనుంది.

## గాయంతో ధోనీ దూరం



**న్యూఢిల్లీ:**

ఐపీఎల్‌లో ఆదిలోనే చెన్నై సూపర్‌కింగ్స్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఐకాన్ ప్లేయర్ మహేంద్రసింగ్ ధోనీ గాయం కారణంగా రెండు వారాల పాటు ఆటకు దూరమయ్యాడు. ఈ విషయాన్ని చెన్నై యాజమాన్యం శనివారం ఒక ప్రకటనలో అధికారికంగా పేర్కొంది. 'ధోనీ ప్రస్తుతం తొడ కండరాల గాయంతో బాధపడుతున్నాడు.పూర్తిగా కోలుకునేందుకు దాదాపు రెండు వారాల సమయం పట్టే అవకాశముంది. దీంతో లీగ్‌లో కొన్ని మ్యాచ్‌లకు అతను అందుబాటులో ఉండటం లేదు' అని చెన్నై తెలిపింది. ఐపీఎల్ మొదలైన 2008 నుంచి ఆడుతున్న 44 ఏండ్ల ధోనీ..చెన్నై ఐదు సార్లు టైటిల్ విజేతగా నిలువడంలో కీలకంగా వ్యవహరించాడు. ప్రతీ సీజన్ ప్రారంభానికి ముందు ధోనీ రిటైర్మెంట్‌పై ఊహాగానాలు మొదలవుతూనే ఉంటాయి. ఈసారి కూడా ధోనీ ఆఖరి ఆట ఆడేస్తాడా అంటూ చర్చ జరుగుతున్నది.

## ఐఎస్ఎల్‌కు రూ.2,129కోట్ల బిడ్

### రాబోయే 20ఏళ్లకు జీనియస్ స్పోర్ట్స్ దాఖలు

**కోల్‌కతా:**

భారత ఫుట్‌బాల్‌కు మంచి రోజులు రానున్నాయి. ఇండియన్ ఫుట్‌బాల్ లీగ్(ఐఎస్ఎల్)కు సుమారు రూ.2,129కోట్లకు జీనియర్ స్పోర్ట్స్ బిడ్ దాఖలు చేసింది. ఇండియన్ సూపర్ లీగ్(ఐఎస్ఎల్), ఫెడరేషన్ కప్ మరియు ఇండియన్ ఉమెన్స్ లీగ్ 1, 2కోసం భారత ఫుట్‌బాల్ సమాఖ్య(ఎఐఎఫ్ఎఫ్) రాబోయే 20ఏళ్లకు బిడ్‌లను ఆహ్వానించింది. దీంతో లండన్‌కు చెందిన స్పోర్ట్స్ టెక్నాలజీ సంస్థ జీనియస్ స్పోర్ట్స్ రూ.2,129కోట్ల బిడ్‌ను దాఖలు చేసినట్లు ఎఐఎఫ్ఎఫ్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఐఎస్ఎల్ సీజన్ ప్రారంభ భాగస్వామి అయిన ఫ్యాన్‌కోడ్(సుమారు రూ.1190కోట్లు) వేసిన బిడ్ కంటే ఇది రెట్టింపు.






అలాగే 2009లో రిలయన్స్ యాజమాన్యంలోని ఫుట్‌బాల్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ లిమిటెడ్(ఎఫ్ఎస్‌డిఎల్)తో కుదిరిన సుమారు రూ.750కోట్లకు మూడురెట్లు అధికంగా ఉంది. ఎఐఎఫ్ఎఫ్ నిబంధనల ప్రకారం ప్రతి ఏటా ఐదు శాతం పెరుగుదల తప్పనిసరి. బిడ్‌లో భాగంగా జీనియస్ స్పోర్ట్స్ రాబోయే 20ఏళ్ల(15o5) మొదటి ఏడాదికి సుమారు రూ.64కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. తదుపరి 15ఏళ్ల ఫ్యాన్‌కోడ్ క్రింద రూ.36కోట్లు, ఎఫ్ఎస్‌డిఎల్‌కు రూ.50కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. బిడ్‌ను ఎఐఎఫ్ఎఫ్ మార్చి 29న కార్యనిర్వాహక కమిటీ ముందు సమర్పించనుండగా.. వాణిజ్య భాగస్వామిపై తుది ప్రకటన విడుదల కావాల్సి ఉంది.




# శ్రీలంక సివిల్ వార్ నేపథ్యంలో నవీన్ చంద్ర 'నీలిర'

## ఆకట్టుకుంటున్న ట్రైలర్!

తమిళ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు సమర్పణలో, నవీన్ చంద్ర, సనంత్ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'నీలిర'. ఈ చిత్రం ఏప్రిల్ 03న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే..1988 నాటి శ్రీలంక అంతర్యుద్ధం (జఅజఅశ్రీ ఔఖితీ) నేపథ్యంలో సాగే చిత్రమని తెలుస్తుంది. కథ ఒక సందడిగా సాగే వివాహ వేడుకతో మొదలై, ఒక్కసారిగా యుద్ధం సృష్టించిన బీభత్సం వైపు మళ్లుతుంది. మారణహోమం మధ్య ఒక కుటుంబం ఎదుర్కొన్న ప్రాణభయం, మనుగడ కోసం వారు పడ్డ ఆవేదన మరియు అణచివేతకు వ్యతిరేకంగా చేసిన పోరాటాన్ని దర్శకుడు సోమీధరన్ వెండితెరపై అత్యంత సహజంగా ఆవిష్కరించారుఈ సినిమాలో నవీన్ చంద్ర తన నటనతో ఆకట్టుకోగా, సనంత్, రూప కొడువాయూర్ మరియు కపిల వేణు తమ పాత్రల్లో ఒదిగిపోయారు. 'ఖ' అందించిన నేపథ్య సంగీతం ఈ యుద్ధ వాతావరణానికి మరింత బలాన్ని చేకూర్చింది. స్టోన్ బెంచ్ ఫిలిమ్స్ పతాకంపై కార్తికేయన్ సంతానం, కార్తీక్ సుబ్బరాజు నిర్మించిన ఈ చిత్రాన్ని రానా దగ్గుబాటికి చెందిన స్పిరిట్ మీడియా సమర్పిస్తోంది. ఇటీవల జరిగిన సినిమా వేడుకకు వెట్రిమారన్, లోకేష్ కనగరాజ్ మరియు ఏఆర్ మురుగదాస్ వంటి దిగ్గజ దర్శకులు హాజరై, యుద్ధం వెనుక ఉన్న సామాన్య మనుషుల బాధలను ఈ సినిమా ప్రతిబింబిస్తుందని ప్రశంసించారు. భారీ అంచనాలతో రూపొందిన ఈ చిత్రం ఏప్రిల్ 3, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



మాల్దీవుల్లో చిల్ అవుతున్న దృశ్యం పాప..




# చెల్లి నిర్మాత... అన్న హీరోగా బరిలోకి

## వరుణ్‌తేజ్ కొత్త సినిమాకు పవన్ క్లాప్


మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, ఆయన సోదరి నిహారిక కొణిదెల నిర్మాణంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'బరి' శనివారం ఘనంగా ప్రారంభమైంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌కు యువ దర్శకుడు యదువంశీ దర్శకత్వం వహిస్తున్నారు. అట్టహాసంగా పూజా కార్యక్రమాలు నిర్వహించగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరై చిత్ర యూనిట్‌ను ఆశీర్వదించారు. ముహూర్తపు సన్నివేశానికి పవన్ కళ్యాణ్ స్వయంగా క్లాప్ కొట్టడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా వరుణ్ తేజ్ భావోద్వేగానికి లోనవుతూ, తన బిజీ షెడ్యూల్ మధ్య కూడా పవన్ కళ్యాణ్ హాజరై ఆశీర్వదించడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. మెగా ఫ్యామిలీ మొత్తం ఒకే వేదికపై కనిపించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. స్పోర్ట్స్ డ్రామాలు, వాస్తవిక కథలు అంటే మలయాళ సినిమాల వైపు చూస్తారనే అభిప్రాయం ఉందని, తెలుగు చిత్ర పరిశ్రమలో కూడా గొప్ప కంటెంట్ ఉందని, మన సంస్కృతి, మన విలువలను ప్రతిబింబించేలా సినిమాలు తెరకెక్కించగల సామర్థ్యం తమకుందని దర్శకుడు యదువంశీ స్పష్టం చేశారు. గతంలో కొత్త కాన్సెప్ట్‌లతో తెలుగు సినిమాలు సక్సెస్ సాధించిన ఉదాహరణలు ఉన్నాయని గుర్తుచేస్తూ, 'బరి'తో ప్రేక్షకులను కొత్త అనుభూతి కలిగించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. 'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో గుర్తింపు పొందిన యదు వంశీ, మొదటి సినిమాతోనే మంచి పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు వరుణ్ తేజ్‌తో కలిసి రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా 'బరి'ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో వరుణ్ తేజ్ వాలీబాల్ ప్లేయర్ పాత్రలో కనిపించనుండటం విశేషం. సంక్రాంతి 2027 కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.



# ఆ సినిమా పైనే ఆశలు పెట్టుకున్న వైష్ణవి..

సోషల్ మీడియా ద్వారా క్రేజ్ తెచ్చుకున్న భామల్లో వైష్ణవి చైతన్య ఒకరు. ఈ చిన్నది సోషల్ మీడియా, యూట్యూబ్ వీడియోల ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకుంది. అంతే కాదు ఈ అమ్మడు పలు షార్ట్ ఫిలిమ్స్ లోనూ నటించి ఆకట్టుకుంది.హీరోయిన్ రేంజ్ అందంతో ఈ కుర్రది కుర్రాళ్ల గుండెల్లో బాణాలు గుచ్చింది. కెరీర్ బిగినింగ్ లో పలు సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసి మంచి మార్కులు కొట్టేసింది. ఆతర్వాత హీరోయిన్ గా మారి సినిమాలు చేస్తుంది. బేబీ సినిమాతో హీరోయిన్ గా మారింది వైష్ణవి.సాయి రాజేష్ దర్శకత్వంలో, ఆనంద్ దేవరకొండ నటించిన బేబీ సినిమా భారీ విజయాన్ని అందుకుంది. చిన్న సినిమాగా వచ్చిన ఈ మూవీ.. ఎవ్వరూ ఊహించని విధంగా సినిమా హిట్ అవ్వడంతో పాటు నటీనటులు మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది.బేబీ సినిమా తర్వాత లవ్ మీ అనే సినిమా చేసింది. ఈ సినిమాడిజాస్టర్ అయ్యింది. ఇక ఇప్పుడు ఎపిక్ అనే సినిమా చేస్తుంది. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. ఈ సినిమా తప్ప వైష్ణవి చేతిలో మరో సినిమాలేదు. దాంతో ఈ సినిమా పై భారీ ఆశలు పెట్టుంది ఈ అమ్మడు.ఎపిక్ సినిమా హిట్ అయితే ఈ చిన్నదానికి అవకాశాలు క్యూ కడతాయి. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ అమ్మడు. రెగ్యులర్ గా ఫోటోలు పంచుకుంటూ అభిమానులను ఆకట్టుకుంటుంది. గ్లామరస్ ఫొటోలతో పాటు ట్రెడిషనల్ ఫోటోలను కూడా పంచుకుంటుంది ఈ కుర్ర భామ.

# కొత్త సినిమా కోసం మారుతి కసరత్తు



రాజా సాబ్ సినిమాతో ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయిన దర్శకుడు మారుతి సైలెంట్ అయ్యారు. ఈ నేపథ్యంలో కొంతకాలంగా సైలెంట్‌గా ఉన్న మారుతి తాజాగా తన తదుపరి ప్రాజెక్ట్‌పై అప్డేట్ ఇచ్చాడు. తన కొత్త సినిమా స్క్రిప్ట్ ప్రస్తుతం చివరి దశలో ఉందని, ఈ ప్రాజెక్ట్‌కు శ్రీరాముడి ఆశీస్సులు ఉన్నాయని ఆయన పేర్కొన్నాడు.ఇదిలా ఉండగా, మారుతి తదుపరి సినిమాకు 'హ్యాపీ పొంగల్' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా, తనకు సొంతమైన కామెడీ శైలిలో తెరకెక్కించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో మెగా హీరో వైష్ణవ్ తేజ్ హీరోగా నటించే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు అధికారిక ప్రకటన రానప్పటికీ, ఈ కాంబినేషన్‌పై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. 'రాజాసాబ్' ఫలితం తర్వాత మారుతి మరింత జాగ్రత్తగా స్క్రిప్ట్‌పై పని చేస్తున్నట్లు కనిపిస్తోంది. తన తదుపరి సినిమాతో మళ్లీ హిట్ ట్రాక్‌లోకి రావాలని ఈ దర్శకుడు భావిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌పై పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com